TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు DD9 వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 06 | సంచిక: 119 | 08-09-2026 | మంగళవారం | పేజీలు: 10 | వెల: 3/-

## కాళేశ్వరం కట్టించి.. చివరకు కూల్చేశారు..

- కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్ ఇంకా మాట్లాడటం సిగ్గుచేటని వ్యాఖ్య
- 'నేనే ఇంజనీర్' అంటూ ప్రాజెక్టు నిర్మించి కూల్చేశారని విమర్శ
- * కాళేశ్వరం నిర్మాణానికి లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం లేదని ఆరోపణ
- * ప్రాజెక్టును సరిగ్గా నిర్మించకపోవడం వల్లే ప్రస్తుత సమస్యలని వెల్లడి
- తెలంగాణలో నీటి సమస్యకు కేసీఆర్, ఎల్‌నినో కారణాలని వ్యాఖ్య



2



## బై బై ఖర్గ్'.. 'మూన్ ఈజ్ అవర్స్'

- గంటలో 34 పోస్టులతో ట్రంప్ సంచలనం
- ఇరాన్‌పై వరుసగా ఏఐ చిత్రాలు, వ్యాఖ్యలు
- ఖర్గ్ ద్వీపాన్ని లక్ష్యంగా చేసుకున్న అమెరికా అధ్యక్షుడు
- 'బై బై ఖర్గ్' అంటూ ఏఐ చిత్రం పోస్టు
- ఇరాన్ పటంపై తన ముఖాన్ని ప్రతిబింబించిన ట్రంప్

2



## శాసనసభ కాదు.. అది దుశ్శాసన సభ

- మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల అమానుష ప్రవర్తన: కేటీఆర్
- దాడి వెనుక సీఎం రేవంత్ హస్తం ఉందని ఆరోపణ
- టీషర్టులపై అభ్యంతరకర పదాలంటున్న డీసీపీ ఎవరని ప్రశ్న
- ఏ నిబంధనల ప్రకారం అడ్డుకున్నారో చెప్పాలని డిమాండ్
- రేవంత్‌ను నిలదీస్తున్నారనే అడ్డంకులు సృష్టించారని విమర్శ
- శాసనసభను 'దుశ్శాసన సభ'గా మార్చేశారని ధ్వజం
- ప్రజల దృష్టి మరల్చేందుకే కొత్త డ్రామాకు తెరలేపారని ఆరోపణ
- సీఎంను విమర్శిస్తే మైక్ ఇవ్వబోమనడం సరికాదన్న కేటీఆర్
- మహిళా నేతలకు క్షమాపణ
- చెప్పే వరకు సభలో నిలదీస్తామని స్పష్టం
- ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై చర్చకు కేటీఆర్ సవాల్

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

సీఎం రేవంత్ రెడ్డి వైఖరిని, పోలీసుల తీరును తీవ్రంగా నిరసిస్తూ తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. తాము సభలో ఎలాంటి అన్ పార్లమెంటరీ పదాలు మాట్లాడలేదని, రాహుల్ గాంధీ తరహాలోనే టీషర్టులతో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపామని స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఎంత రెచ్చగొట్టినా సంయమనం పాటించాలని కేసీఆర్ తమకు సూచించారని, కానీ రేవంత్ రెడ్డి ఆయన పోలీస్ బృందంతో కలిసి అత్యంత కిరాతకంగా వ్యవహరించారని మండిపడ్డారు. సునీతా లక్ష్మారెడ్డి,

మిగతా 2లో..





# అసైన్‌మెంట్ భూమిలో అక్రమ లేఅవుట్!

3

- అధికారుల అనుమతులు లేకుండానే 12 ప్లాట్లు.. యథేచ్ఛగా విక్రయాలు?
- రైతు భరోసా నిధులపైనా ఆరోపణలు.. రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులపై ఫిర్యాదు



## యూట్యూబర్ నందన అరెస్ట్

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నందనను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- లుక్ అవుట్ నోటీసుల నేపథ్యంలో యాక్షన్
- కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం
- లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు
- నందన దంపతులపై పలువురు బాధితుల ఫిర్యాదులు
- భారీగా నగదు వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తు
- వ్యవహారంపై ఇబ్రహీంపట్నం పోలీసుల కేసు నమోదు
- ఇప్పటికే దర్యాప్తు చేపట్టిన పోలీసులు
- నందనపై ఉన్న కేసుల ఆధారంగా తదుపరి చర్యలకు సిద్ధం
- లుక్ అవుట్ నోటీసుల ఆధారంగా విచారణకు ఏర్పాట్లు

2

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

యూట్యూబర్ నందనను శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై లుక్ అవుట్ నోటీసులు జారీ కావడంతో ఎయిర్‌పోర్టులో పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అనంతరం ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసులకు సమాచారం ఇచ్చారు.

**లండన్ ఉద్యోగాల పేరుతో డబ్బులు?**

లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురి నుంచి నందన, ఆమె భర్త భారీగా డబ్బులు

## మహిళలను అవమానిస్తే.. చట్టం తన పని తాను చేసుకుపోతుంది

- మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలను సహించబోమని సీఎం హెచ్చరిక
- భావప్రకటనా స్వేచ్ఛాన్ని ఎలా ఉపయోగిస్తున్నామో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచన
- మహిళలను కించపరిచేలా మాట్లాడటం ఆమోదయోగ్యం కాదని స్పష్టీకరణ
- ద్వంద్వార్థం వచ్చే పదాలు వాడుతున్నారని పరోక్షంగా విమర్శ
- మనందరి ఇళ్లలో తల్లి, అక్కా చెల్లెళ్లు ఉన్నారని సీఎం వ్యాఖ్య
- మహిళలను అవమానిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరిక
- ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించిన విజయ్
- జయలలిత అసెంబ్లీలో ఎదుర్కొన్న అవమానాలను గుర్తుచేసిన సీఎం
- పోలీసు వ్యవస్థ రాష్ట్ర అభివృద్ధికి పునాది అని విజయ్ వ్యాఖ్య
- అవినీతిని సహించేది లేదని, లాకప్ నేరాలపై పారదర్శక విచారణకు హామీ



2

## సునీతా లక్ష్మారెడ్డి చీర లాగితే ఆవేశం రాదా?

- అసెంబ్లీ గేటు వద్ద ఘటన ప్రజాస్వామ్యంలో బ్లాక్ డే
- మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డిని పోలీసులు అవమానించారని ఆరోపణ
- 'మా చెల్లెమ్మ చీర లాగితే ఆవేశం రాదా' అంటూ హరీశ్‌రావు ప్రశ్న
- 'అక్క చీర లాగితే తమ్ముడు చూస్తూ ఊరుకుంటాడా' అని నిలదీత
- సబితా ఇంద్రారెడ్డి గొంతు పోలీసులు నులిమారని ఆరోపణ
- జగదీశ్‌రెడ్డిని కిందపడేసి తొక్కారని హరీశ్‌రావు వ్యాఖ్య
- బీఆర్ఎస్ నేతల టీషర్టులపై అభ్యంతరకర నినాదాలు లేవని వెల్లడి



2



## పురాతన ఆలయాల సంరక్షణకు కట్టుబడి ఉన్నాం..

- గోదావరి పుష్కరాలను అద్భుతంగా నిర్వహిస్తాం..
- ధర్మపురి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో పుష్కరాలకు అభివృద్ధి పనులు..
- ఉగ్ర నరసింహ స్వామి పునర్ నిర్మాణం లో పాల్గొనడం అదృష్టం..
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క..

**ధర్మపురి/జగిత్యాల ,(డీడీ9 వార్త)**

రాష్ట్రంలోని పురాతన ఆలయాల సంరక్షణకు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి లోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఉగ్ర నరసింహ స్వామి పునర్ నిర్మాణ పనులకు సోమవారం తెల్లవారుజామున రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు లతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు మంత్రులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ముందుగా ఉగ్ర నరసింహ స్వామి ఆలయంలో ఉపముఖ్యమంత్రి తో పాటు మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ 9 ఏళ్ల బీఆర్ఎస్ పాలనకు చరమగీతం పాడిన తెలంగాణ ప్రజలు రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నారని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో ప్రజల ఆలోచనలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తున్నామని అన్నారు. 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం అద్భుతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా బాసర నుండి భద్రాచలం వరకు ఉన్న ప్రముఖ ఆలయాలను అభివృద్ధి చేయడంతో పాటు పుష్కరాలకు వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పుష్కరాల పనులు

మిగతా 2లో..

మిగతా 3లో..

# కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది

- 'సర్' పేరుతో వ్యతిరేక ఓట్ల తొలగింపునకు ప్లాన్
- గ్రామాల్లో ఉన్నవారి ఓట్లను తీసేస్తున్నారని సీఎం ఆరోపణ
- తన నియోజకవర్గంలో 80 వేల ఓట్లు తొలగించే ప్రయత్నమని వెల్లడి
- ఓట్ల తొలగింపుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన
- బిహార్, బెంగాల్ విధానాన్ని అమలు చేస్తామంటున్న బీజేపీ నేతలు
- 'సర్'కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్న
- 2029లో మోదీ ఓటమికి ఓట్లే పునాది అవుతాయని వ్యాఖ్య
- దేశానికి మోదీ అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి అని విమర్శ
- మోదీ ఓటమే కమ్యూనిస్టుల గెలుపు అని సీఎం వ్యాఖ్య
- ప్రజాస్వామ్య పరిరక్షణకు అంతా అప్రమత్తంగా ఉండాలని పిలుపు



**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

'సర్' పేరుతో వ్యతిరేక ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లను తీసేసే కుట్ర జరుగుతోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో నివసిస్తున్న ప్రజల ఓట్లను తొలగిస్తున్నారని మండిపడ్డారు. తన నియోజకవర్గంలోనే 80 వేల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని సీఎం ఆరోపించారు. రవీంద్రభారతిలో కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి.. సారంపల్లి మల్లారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడిన ఆయన ఓట్ల తొలగింపు అంశంపై తీవ్ర ఆరోపణలు చేశారు.

**కోటి ఓట్లను తొలగించే కుట్ర**

తెలంగాణలో కోటి ఓట్లను తొలగించేందుకు కుట్ర జరుగుతోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉన్న ప్రజల ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. తన నియోజకవర్గంలోనే 80 వేల ఓట్లను తొలగించేందుకు ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. ఈ పరిణామాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**'సర్'పై బీఆర్ఎస్ ఎందుకు మౌనం?**

'సర్'కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఒక్క మాట కూడా ఎందుకు మాట్లాడటంw

మిగతా 2లో..

మిగతా 2లో..

# కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది

**మొదటిపేజీ తరువాయి**

లేదని సీఎం ప్రశ్నించారు. ఓట్ల తొలగింపు అంశంపై అన్ని వర్గాలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ఓటు హక్కును కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

**బీజేపీ నేతలపై విమర్శలు**

బిహార్, బెంగాల్ విధానాన్ని ఉపయోగిస్తామని బీజేపీ నేతలు బరితెగించి మాట్లాడుతున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఓట్ల వ్యవహారంలో జరుగుతున్న పరిణామాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఓట్ల తొలగింపు అంశం 2029 ఎన్నికల్లో కీలక ప్రభావం చూపుతుందని సీఎం వ్యాఖ్యానించారు. ఈ ఓట్లతోనే 2029లో ప్రధాని మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. ఓట్ల తొలగింపుపై ప్రజలు, రాజకీయ పార్టీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**మోదీపై తీవ్ర వ్యాఖ్యలు**

ప్రధాని మోదీ దేశానికి అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి అని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మోదీ ఓటమే కమ్యూనిస్టుల గెలుపు అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, దాని పరిరక్షణకు అందరూ జాగ్రత్తగా ఉండాలని సీఎం సూచించారు.

# శాసనసభ కాదు.. అది దుశ్శాసన సభ

**మొదటిపేజీ తరువాయి**

సబితా ఇంద్రారెడ్డి మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారని, పోలీసు బలగం దుర్మార్గమైన చర్యలను ప్రజలంతా గమనించారని అన్నారు. ఈ దాడి వెనుక ముమ్మాటికీ సీఎం రేవంత్ రెడ్డి హస్తమే ఉందన్న కేటీఆర్, టీషర్టులపై అభ్యంతరకర పదాలు ఉన్నాయనడానికి డీసీపీ శిల్పవల్లి ఎవరని ప్రశ్నించారు. ఏ రూల్ ప్రకారం తమను అడ్డుకున్నారో చెప్పకుండా, రేవంత్ రెడ్డిని నిలదీస్తున్నారనే నెపంతోనే ఈ అడ్డంకులు సృష్టించారని ధ్వజమెత్తారు. శాసనసభను దుశ్శాసన సభగా మార్చేశారని, ప్రజల దృష్టిని మరల్చేందుకే ప్రభుత్వం కొత్త డ్రామాకు తెరలేపిందని విమర్శించారు.

స్పీకర్ స్థానంలో ఉండి వివక్ష చూపించడం తగదని, సీఎంను విమర్శిస్తే మైక్ ఇవ్వబోమనడం సరికాదని హితవు పలికారు. గలాటాకు ఆద్యుడైన ముఖ్యమంత్రి నిరసనకారులకు, మహిళా నేతలకు క్షమాపణ చెప్పే వరకు సభలో నిలదీస్తామని తేల్చిచెప్పారు. నాడు డి.కె. అరుణకు తాము క్షమాపణ చెప్పిన విషయాన్ని, తాతా మధు విచారణ వ్యక్తం చేయాలని కేసీఆర్ ఆదేశించిన అంశాన్ని గుర్తుచేశారు. దళితులపై ప్రేమ ఉంటే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై చర్చ పెట్టాలని సవాల్ విసిరారు.

సభలో బూతులు మాట్లాడే రేవంత్ రెడ్డి నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వంద రోజుల్లో హామీలు అమలు చేయని రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని, ఈ దాడికి నిరసనగా తాము బీఏసీ సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని ప్రకటించారు. గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరామని, కాంగ్రెస్‌బీజేపీ కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. స్పీకర్ పక్షపాతంగా వ్యవహరిస్తే అవసరమైతే ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామని హెచ్చరించారు.

# మహిళలను అవమానిస్తే.. చట్టం తన పని తాను చేసుకుపోతుంది

- **మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలను సహించబోమని సీఎం హెచ్చరిక**
- **భావప్రకటనా స్వేచ్ఛాన్ని ఎలా ఉపయోగిస్తున్నామో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచన**
- **మహిళలను కించపరిచేలా మాట్లాడటం ఆమోదయోగ్యం కాదని స్పష్టీకరణ**
- **ద్వంద్వార్థం వచ్చే పదాలు వాడుతున్నారని పరోక్షంగా విమర్శ**
- **మనందరి ఇళ్లలో తల్లి, అక్కా చెల్లెళ్లు ఉన్నారని సీఎం వ్యాఖ్య**
- **మహిళలను అవమానిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరిక**
- **ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించిన విజయ్**
- **జయలలిత అసెంబ్లీలో ఎదుర్కొన్న అవమానాలను గుర్తుచేసిన సీఎం**
- **పోలీసు వ్యవస్థ రాష్ట్ర అభివృద్ధికి పునాది అని విజయ్ వ్యాఖ్య**
- **అవినీతిని సహించేది లేదని, లాకప్ నేరాలపై పారదర్శక విచారణకు హామీ**



**చెన్నై,(డీడీ9 వార్త)**

మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తే చట్టం చూస్తూ ఊరుకోదని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ హెచ్చరించారు. భావప్రకటనా స్వేచ్ఛాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉపయోగించుకోవాలని సూచించారు. తాము మాట్లాడే మాటలు ప్రజలు గమనిస్తుంటారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. నటి త్రిషను ఉద్దేశించి ఉదయనిధి స్టాలిన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై దుమారం కొనసాగుతున్న నేపథ్యంలో.. శాసనసభలో సీఎం విజయ్ ఈ అంశంపై పరోక్షంగా స్పందించారు.

**ద్వంద్వార్థ వ్యాఖ్యలపై హెచ్చరిక**

కొందరు మాట్లాడేటప్పుడు ద్వంద్వార్థం వచ్చే పదాలను ఉపయోగిస్తున్నారని విజయ్ అన్నారు. వాటిని ప్రజలందరూ గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి కుటుంబంలోనూ తల్లి, అక్కా చెల్లెళ్లు ఉంటారని గుర్తుచేశారు. మహిళలను అవమానించేలా మాట్లాడితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు.

మహిళలను కించపరిచే వ్యాఖ్యలను రాజకీయ కోణంలో చూడకూడదని విజయ్ సూచించారు. ఉదయనిధి స్టాలిన్ పేరును ప్రస్తావించకుండానే ఆయన చేసిన వ్యాఖ్యలపై పరోక్షంగా తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

**జయలలిత అవమానాలను గుర్తుచేసిన సీఎం**

ఇదే అసెంబ్లీలో దివంగత ముఖ్యమంత్రి జయలలిత ఎన్ని అవమానాలు ఎదుర్కొన్నారో అందరూ చూశారని విజయ్ అన్నారు. ప్రతి ఒక్కరికీ మాట్లాడే స్వేచ్ఛ ఉంటుందని, అయితే ఆ స్వేచ్ఛను బాధ్యతగా ఉపయోగించుకోవాలని సూచించారు. తాము మాట్లాడే ప్రతి మాటను ప్రజలు గమనిస్తుంటారని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

**పోలీసుల విధుల్లో జోక్యం వద్దు**

రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణపై వచ్చిన విమర్శలకు కూడా విజయ్ దీటుగా బదులిచ్చారు. పోలీసు వ్యవస్థ కేవలం అరెస్టులు చేయడానికి మాత్రమే కాదని, రాష్ట్ర అభివృద్ధికి అది పునాది అని తెలిపారు. పోలీసులు చట్టాన్ని పాటించే వారికి మిత్రులుగా, చట్టాన్ని ఉల్లంఘించే వారికి శత్రువులుగా ఉంటారని పేర్కొన్నారు.

రాజకీయ నాయకులు, అధికారులు పోలీసుల విధుల్లో జోక్యం చేసుకోకూడదని విజయ్ స్పష్టం చేశారు. పోలీసు వ్యవస్థ స్వతంత్రంగా తన విధులు నిర్వర్తించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

**అభివృద్ధిపైనే ప్రభుత్వ దృష్టి**

తమ ప్రభుత్వం విమర్శలపై దృష్టి పెట్టబోదని విజయ్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేయడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని తెలిపారు.

**అవినీతిని సహించేది లేదు**

రాష్ట్రంలో అవినీతిని ఎంతమాత్రం సహించబోమని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. అధికారులు అవినీతికి పాల్పడితే వారి కుటుంబాలు కూడా సమాజంలో తలదించుకోవాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. అధికారులంతా నిజాయితీగా పనిచేయాలని సూచించారు.

**లాకప్ నేరాలపై పారదర్శక విచారణ**

లాకప్ నేరాలు సాధారణమైనవి కాదని విజయ్ అన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు వాటిపై మేజిస్ట్రేట్ ద్వారా పారదర్శక విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు పోలీసుల పనితీరులోనూ జవాబుదారీతనం ఉండేలా చూస్తామని స్పష్టం చేశారు.

# పురాతన ఆలయాల సంరక్షణకు కట్టుబడి ఉన్నాం..

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించడానికి బడ్జెట్లో వెయ్యి కోట్లు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి, కోటి లింగాల క్షేత్రాల అభివృద్ధికి రూ. 200కోట్లు కేటాయించినట్లు భట్టి తెలిపారు.వందల ఏళ్ల చరిత్ర కలిగిన ధర్మపురి ఉగ్ర నరసింహ స్వామి పునర్ నిర్మాణ పనుల ప్రారంభానికి రావడం అదృష్టంగా ఉందని ఉపముఖ్యమంత్రి అన్నారు. అద్భుత కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు భట్టి విక్రమార్క అన్నారు. వచ్చే పుష్కరాలు నాటికి ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని భట్టి వివరించారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన..**

ధర్మపురి లోని ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునర్ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ. 10 కోట్ల కేటాయించగా పనుల ప్రారంభానికి ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామంలో నూతనంగా రూ. 2.48 కోట్లతో ఏర్పాటు చేస్తున్న నూతన సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. 2027 గోదావరి పుష్కరాలకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ధర్మపురి వద్ద గోదావరిలో పుష్కర ఘాట్ల నిర్మాణానికి రూ. 22. 16 కోట్లతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. ధర్మపురి, కోటి లింగాలలో రూ. 58.55 కోట్లతో తొమ్మిది రోడ్ల నిర్మాణ పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు.

**ధర్మపురికి రూ. 80కోట్లు మంజూరు..**

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలో పర్యటించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ధర్మపురి నియోజకవర్గంలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు మరో 80 కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారు ప్రకటించారు. గోదావరి పుష్కరాలకు ఇప్పటికే ధర్మపురి నియోజకవర్గానికి 117 కోట్లు విడుదల గాక ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రూ. 80కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడంతో ధర్మపురి నియోజకవర్గానికి గోదావరి పుష్కరాల నిధులు సుమారుగా 200 కోట్లకు చేరింది.

**లక్ష్మీ నరసింహ స్వామి దయతో ముందుకు..**

**రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దయతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి ప్రజల ఆశీస్సులతో విజయం సాధించి నియోజకవర్గాన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నానని మంత్రి తెలిపారు.

# సునీతా లక్ష్మారెడ్డి చీర లాగితే ఆవేశం రాదా?

- **అసెంబ్లీ గేటు వద్ద ఘటన ప్రజాస్వామ్యంలో బ్లాక్ డే**
- **మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డిని పోలీసులు అవమానించారని ఆరోపణ**
- **'మా చెల్లెమ్మ చీర లాగితే ఆవేశం రాదా' అంటూ హరీశ్‌రావు ప్రశ్న**
- **'అక్క చీర లాగితే తమ్ముడు చూస్తూ ఊరుకుంటాడా' అని నిలదీత**
- **సబితా ఇంద్రారెడ్డి గొంతు పోలీసులు నులిమారని ఆరోపణ**
- **జగదీశ్‌రెడ్డిని కిందపడేసి తొక్కారని హరీశ్‌రావు వ్యాఖ్య**
- **బీఆర్ఎస్ నేతల టీషర్టులపై అభ్యంతరకర నినాదాలు లేవని వెల్లడి**
- **రాహుల్, ప్రియాంక నిరసన టీషర్టులతో పార్లమెంట్‌కు వెళ్లలేదా అని ప్రశ్న**
- **'వారికో న్యాయం.. మాకో న్యాయమా' అంటూ ప్రభుత్వంపై మండిపాటు**
- **ప్రతిపక్షం లేకుండానే అసెంబ్లీలో చర్చ జరపాలని చూస్తున్నారని ఆరోపణ**

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగారంటూ బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన ప్రజాస్వామ్యంలో బ్లాక్ డే అని అభివర్ణించారు. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి ఆమెను అవమానించారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేతల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మా చెల్లెమ్మ చీర లాగితే ఆవేశం రాదా.. అక్క చీర లాగితే తమ్ముడు చూస్తూ ఊరుకుంటాడా' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మహిళా ప్రజాప్రతినిధి పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించారని ఆరోపిస్తూ ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉందని, ఆ హక్కును అడ్డుకోవడం సరికాదని అన్నారు.

**సబితా గొంతు నులిమారు**

నిరసన సందర్భంగా పోలీసులు తమ పార్టీ నేతలపై వ్యవహరించిన తీరును కూడా హరీశ్‌రావు ప్రస్తావించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గొంతును పోలీసులు నులిమారని ఆరోపించారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కిందపడేసి తొక్కారని చెప్పారు. ప్రతిపక్ష నేతల పట్ల పోలీసుల ప్రవర్తన తీవ్ర అభ్యంతరకరంగా ఉందని విమర్శించారు.

**టీషర్టులపై అభ్యంతరం ఎందుకు?**

బీఆర్ఎస్ నేతలు ధరించిన టీషర్టులపై ప్రభుత్వం, పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేయడాన్ని కూడా హరీశ్‌రావు తప్పుబట్టారు. తమ టీషర్టులపై ఎలాంటి అభ్యంతరకర నినాదాలు లేవని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ నిరసన టీషర్టులతో పార్లమెంట్‌కు వెళ్లలేదా అని ప్రశ్నించారు. రాహుల్, ప్రియాంకలకు ఒక న్యాయం.. తమకు మరో న్యాయమా అని హరీశ్‌రావు నిలదీశారు. నిరసన తెలిపే విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు వేర్వేరు నిబంధనలు ఉండకూడదని అన్నారు.

**ప్రతిపక్షం లేకుండానే చర్చా?**

అసెంబ్లీలో ప్రతిపక్షం లేకుండానే చర్చ జరపాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజల సమస్యలను లేవనెత్తేందుకు ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వకుండా సభను నిర్వహించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సునీతా లక్ష్మారెడ్డి ఘటనతో పాటు సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డిల విషయంలో చోటుచేసుకున్న పరిణామాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# యూట్యూబర్ నందన అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి**

వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారానికి సంబంధించి బాధితుల నుంచి ఫిర్యాదులు అందడంతో ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

**దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

నందన దంపతులపై నమోదైన కేసుకు సంబంధించి ఇబ్రహీంపట్నం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఉద్యోగాల పేరుతో ఎంతమంది నుంచి డబ్బులు వసూలు చేశారు? ఎంత మొత్తంలో నగదు తీసుకున్నారు? తదితర అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు.

**తదుపరి చర్యలకు సిద్ధం**

నందనపై నమోదైన కేసులు, ఆమెకు జారీ అయిన లుక్ అవుట్ నోటీసుల ఆధారంగా పోలీసులు తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు. ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్న అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులు విచారించే అవకాశం ఉంది. కేసు దర్యాప్తులో వెలుగులోకి వచ్చే వివరాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

## శ్రావణ చివరి సోమవారం.. రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

- **స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి.**
- **తాండూర్ నియోజకవర్గం సుభిక్షంగా, అభివృద్ధి పథంలో సాగాలి.**
- **ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి.**



**తాండూర్, సెప్టెంబర్ 07(డీడీ9 వార్త):**

శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా తాండూర్ నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలంలోని శ్రీ ఏకాంబరి రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ నిర్వాహకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ రామలింగేశ్వర స్వామివారి ఆశీస్సులు బషీరాబాద్ మండలంతో పాటు తాండూర్ నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీపీసీసీ ప్రచార కోఆర్డినేటర్ కర్ణం పురుషోత్తం రావు, బషీరాబాద్ మండలం నీళ్లపల్లి గ్రామ నాయకులు సుధాకర్ రెడ్డి, ఆలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, పి.కె. నర్సిములు, పెంటప్ప, మాజీ ఎంపీటీసీ బాబు, బి. వెంకటయ్య, గౌతమ్, బీదర్ రాజశేఖర్, యువ నాయకులు సిద్ధూ పంతులు, రవి కుమార్‌తో పాటు గ్రామ భక్తులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బై బై ఖర్గ్'.. 'మూన్ ఈజ్ అవర్స్'..

**అమెరికా , (డీడీ9 వార్త):**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు, చిత్రాలతో వార్తల్లో నిలిచారు. ట్రూత్ సోషల్‌లో గంట వ్యవధిలోనే దాదాపు 34 పోస్టులు చేస్తూ ఇరాన్, అమెరికా ఆర్థిక పరిస్థితి, అంతరిక్షం, భౌగోళిక ప్రాంతాల పేర్లపై వరుసగా పోస్టులు పెట్టారు. వీటిలో అనేకం ఏఐ సృష్టించిన చిత్రాలు, గ్రాఫిక్స్ కావడం విశేషం.

ముఖ్యంగా ఇరాన్‌లోని కీలక చమురు ఎగుమతి కేంద్రం ఖర్గ్ ద్వీపాన్ని ప్రస్తావిస్తూ ట్రంప్ చేసిన పోస్టు తీవ్ర చర్చకు దారితీసింది. 'బై బై ఖర్గ్' అనే సందేశంతో ఆయన షేర్ చేసిన ఏఐ చిత్రంలో ఓ యుద్ధ విమానం ఖర్గ్ ద్వీపంలోని చమురు మౌలిక సదుపాయాల వైపు దూసుకెళ్తున్నట్లుగా, అక్కడ భారీగా మంటలు చెలరేగినట్లుగా చూపించారు.

ఖర్గ్ ద్వీపం ఇరాన్ చమురు ఎగుమతులకు అత్యంత కీలకమైన ప్రాంతం. యుద్ధానికి ముందు ఇరాన్ చమురు ఎగుమతుల్లో సుమారు 90 శాతం ఈ కేంద్రం మీదుగానే జరిగేవని రాయిటర్స్ పేర్కొంది. అయితే ట్రంప్ గతంలో ఖర్గ్ ద్వీపం ధ్వంసమైనట్లుగా ఏఐ వీడియోను పోస్టు చేసినప్పటికీ, అది వాస్తవ సైనిక దాడికి సంబంధించిన దృశ్యం కాదని అమెరికా అధికారులు స్పష్టం చేశారు.

ఇదే వరుసలో ఇరాన్ పటంపై తన ముఖం ప్రతిబింబించేలా రూపొందించిన చిత్రాన్ని కూడా ట్రంప్ పోస్టు చేశారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థ, చమురు ఎగుమతులు, కరెన్సీ పతనాన్ని ప్రస్తావిస్తూ పలు గ్రాఫిక్స్‌ను కూడా ఆయన పంచుకున్నారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిడిలో ఉందని చూపించేలా ఈ పోస్టులు ఉన్నాయి.

**చంద్రుడు మాకే సొంతం**

ఇరాన్‌కు సంబంధించిన పోస్టులతో పాటు ట్రంప్ అంతరిక్షంపైనా ఆసక్తికర వ్యాఖ్య చేశారు. అమెరికా జెండాతో ఉన్న చంద్రుడి చిత్రాన్ని పోస్టు చేస్తూ ది మూన్ ఈజ్ అవర్స్ అని పేర్కొన్నారు. చంద్రుడిపై ఏ దేశమూ సార్వభౌమాధికారం ప్రకటించడానికి అంతర్జాతీయ అంతరిక్ష చట్టం అనుమతించదు.

**న్యూ మెక్సికో'.. 'న్యూ అమెరికా**

ఇక అమెరికాలోని న్యూ మెక్సికో రాష్ట్రానికి 'న్యూ అమెరికా'గా పేరు మార్చుతున్నట్లుగా కనిపించే మ్యాప్‌ను కూడా ట్రంప్ షేర్ చేశారు. అయితే రాష్ట్రం పేరును అధికారికంగా మార్చే ఎలాంటి ఉత్తర్వును ట్రంప్ జారీ చేయలేదు. న్యూ మెక్సికో గవర్నర్ మిషెల్ లుహాన్ గ్రిషమ్ కూడా రాష్ట్రం పేరును మార్చే అంశం చర్చలో లేదని స్పష్టం చేశారు.

ఇదే క్రమంలో హార్ముజ్ జలసంధి పేరును 'ట్రంప్ స్ట్రెయిట్'గా మార్చాలన్న సూచనతో కూడిన పోస్టు కూడా ఆయన ఖాతాలో కనిపించింది. అమెరికా ఆధిపత్యాన్ని ప్రతిబింబించేలా పేర్ల మార్పు అంశాన్ని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టుల్లో పదేపదే ప్రస్తావిస్తున్నారు.

ఇంతకుముందు గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా మార్చే చర్యలను ట్రంప్ ప్రభుత్వం చేపట్టింది. తాజాగా న్యూ మెక్సికోను 'న్యూ అమెరికా'గా చూపించే పోస్టు, చంద్రుడిపై హక్కు ప్రకటించినట్లుగా ఉన్న వ్యాఖ్య, ఖర్గ్ ద్వీపంపై ఏఐ దృశ్యాలు—అన్నీ కలిపి ట్రంప్ తాజా సోషల్ మీడియా ప్రచారం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# కాళేశ్వరం కట్టించి.. చివరకు కూల్చేశారు..

- **కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్ ఇంకా మాట్లాడటం సిగ్గుచేటని వ్యాఖ్య**
- **'నేనే ఇంజనీర్' అంటూ ప్రాజెక్టు నిర్మించి కూల్చేశారని విమర్శ**
- **కాళేశ్వరం నిర్మాణానికి లక్ష కోట్లు ఖర్చు చేసినా ఫలితం లేదని ఆరోపణ**
- **ప్రాజెక్టును సరిగ్గా నిర్మించకపోవడం వల్లే ప్రస్తుత సమస్యలని వెల్లడి**
- **తెలంగాణలో నీటి సమస్యకు కేసీఆర్, ఎల్‌నినో కారణాలని వ్యాఖ్య**
- **నీటి పంపకాల విషయంలో కేసీఆర్ తెలంగాణకు అన్యాయం చేశారని ఆరోపణ**
- **ఇరిగేషన్ శాఖను కేసీఆర్ పూర్తిగా నాశనం చేశారని విమర్శ**
- **ఇరిగేషన్‌లో గత ప్రభుత్వం చేసిన తప్పులే నేటి సమస్యలకు కారణమని వెల్లడి**
- **కేసీఆర్‌కు ఇరిగేషన్‌పై సరైన అవగాహన లేదని మంత్రి వ్యాఖ్య**
- **కేసీఆర్ మాట్లాడిన భాషతో తెలంగాణ భాషకు చెడ్డపేరు వచ్చిందని ఆరోపణ**

**హైదరాబాద్, (డీడీ9 వార్త):**

కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇంకా మాట్లాడటం సిగ్గుచేటని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడిన ఆయన.. కాళేశ్వరం నిర్మాణం, తెలంగాణలో ప్రస్తుత నీటి సమస్యలపై కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. 'నేనే ఇంజనీర్' అంటూ కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి, చివరకు కూల్చేశారని ఎద్దేవా చేశారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ.. దాన్ని సరిగ్గా నిర్మించకపోవడం వల్లే ప్రస్తుతం సమస్యలు ఎదురవుతున్నాయని ఉత్తమ్ ఆరోపించారు. భారీగా నిధులు ఖర్చు చేసినా రైతులకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం అందలేదని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులను కేవలం ఖర్చు చేసిన మొత్తంతో కాకుండా రైతులకు అందిన నీరు, సాగులోకి వచ్చిన ఆయకట్టు ఆధారంగా అంచనా వేయాలని ఉత్తమ్ ఇటీవల కూడా పేర్కొన్నారు.

**నీటి సమస్యకు రెండు కారణాలు**

తెలంగాణలో ప్రస్తుతం ఎదురవుతున్న నీటి సమస్యకు రెండు ప్రధాన కారణాలు ఉన్నాయని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. అందులో ఒకటి ఎల్‌నినో కాగా.. మరొకటి కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. నీటి పంపకాల విషయంలో కేసీఆర్ తెలంగాణకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఇరిగేషన్ శాఖను పూర్తిగా నాశనం చేశారని విమర్శించారు.

**తప్పుల వల్లే ప్రస్తుత సమస్యలు**

ఇరిగేషన్ విషయంలో కేసీఆర్ చేసిన తప్పుల కారణంగానే ప్రస్తుతం రాష్ట్రం ఇబ్బందులు ఎదుర్కొంటోందని ఉత్తమ్ అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రానికి నష్టం కలిగించాయని ఆరోపించారు. కాళేశ్వరంతో పాటు పలు ప్రాజెక్టులకు భారీగా ఖర్చు చేసినా ఆశించిన ప్రయోజనాలు అందలేదని విమర్శించారు.

**కేసీఆర్ భాషపైనా విమర్శలు**

కేసీఆర్ మాట్లాడిన భాష వల్ల తెలంగాణ భాషకు చెడ్డపేరు వచ్చిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. గతంలో కేసీఆర్ అనుచిత భాష ఉపయోగించినప్పుడు ఆయనను బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు హీరోలా భావించారని వ్యాఖ్యానించారు. ఇప్పుడు అదే భాషను ఆయనపై ఉపయోగిస్తే ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ప్రశ్నించారు.

**పాదయాత్రపైనా సెటైర్లు**

కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై కూడా ఉత్తమ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కూలిపోయిన కాళేశ్వరం వద్దకు కేసీఆర్ వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్ పాదయాత్ర చేస్తే ప్రజలు నవ్వుకుంటారని వ్యాఖ్యానించారు. ఇరిగేషన్ విషయంలో కేసీఆర్ ఫామ్‌హౌస్‌లోనే ఉండటం మంచిదని కూడా విమర్శించారు.

ఇరిగేషన్ రంగంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుతూ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడం, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా వినియోగించడం తమ ప్రభుత్వ లక్ష్యమని ఉత్తమ్ గతంలో స్పష్టం చేశారు. తెలంగాణకు కృష్ణా, గోదావరి జలాల్లో రావాల్సిన వాటా కోసం అవసరమైన అన్ని వేదికలపై పోరాడుతామని కూడా ఆయన తాజాగా తెలిపారు.





## బాన్సువాడలో సదరం క్యాంపు నిర్వహణ

- **51 మంది దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు**

**బాన్సువాడ, సెప్టెంబర్ 7(డిడి9 వార్త):**

బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సోమవారం సదరం క్యాంపును నిర్వహించారు.డాక్టర్లు ప్రవీణ్ కుమార్, మన్నె సాయిలు, రంజన్ కుమార్, పోచయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి మండల పరిధిలోని 51 మంది దివ్యాంగులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా దివ్యాంగులకు అవసరమైన నిర్ధారణ పరీక్షలను వైద్యులు నిర్వహించారు.సదరం సర్టిఫికెట్ల కోసం వచ్చిన దివ్యాంగుల సమస్యలను పరిశీలించి, వైద్య పరీక్షల అనంతరం అర్హతలను నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మైనారిటీ సెక్రెటరీ ఎండీ. దావూద్, డీఆర్డీఏ సిబ్బంది షర్బని రాజేశం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సోనాల మండలంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే

- **అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు**

**అదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 7:(డిడి 9 వార్త న్యూస్)**

సోనాల మండలంలోనిగుర్రాల తండా గ్రామములో ఈ రోజు ఇందిరమ్మ సర్వే లో భాగంగా సర్పంచ్ కటారే దినేష్ సమక్షంలో ఎ ఓ దేవానంద్ ఉపసర్పంచ్ భానియా గోవన్ సింగ్ మరియు పంచాయతీ సెక్రెటరీ తేజస్విణి డి సి సి కార్యదర్శి చాహన్ హరిసింగ్ ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల మంజూరు కోసం విజిటింగ్ చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో గుర్రాల తండా గ్రామస్తులు పాల్గొన్నారు అర్హులైన పేద ప్రజ లందరికి ఇందిరమ్మ ఇల్లు కల్పిస్తామని భరోసా ఇవ్వడం జరిగింది



## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ఆర్థిక సహాయం

- **జన్మదిన సందర్భంగా కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందించిన ఏలేటి అశ్విన్ రెడ్డి**

**ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం సెప్టెంబర్ 7 (డిడి 9 వార్త న్యూస్)**

సోనాల మండలానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త సింధేకర్ చందు గత కొన్ని రోజుల క్రితం ప్రమాదం లో గాయపడి అనారోగ్యం చెందాడు .ఆ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం చేయాలని కోరిన వెంటనే తన పుట్టినరోజు సందర్భంగా ఆ కుటుంబానికి 10000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనీష్ కుమార్ ఆధ్వర్యం లో అందచేయడం జరిగింది .ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు నరోత్తమ్ రెడ్డి ,గుడాల శేఖర్,డీసీసీ కార్యదర్శి హరిసింగ్,ఓబీసీ నియోజకవర్గ అధ్యక్షులు జంగాల భోజన్న,బాశెట్టి సుదర్శన్,కాకాజీ,చందర్ సింగ్,పెద్దకుర్మే శంకర్,మహేష్,రాజారాం,రవికాంత్, రాజేశ్వర్,తదితరులు ఉన్నారు.



## ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

- **ప్రస్తుత కాలంలో వ్యాపిస్తున్న వ్యాధుల గురించి ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి**
- **సోనాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందిస్తున్నాము**

**ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం సెప్టెంబర్ 7: (డిడి9 వార్త న్యూస్):-**

సోనాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించడం జరుగుతుంది ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి ఆరోగ్యమే మహాభాగ్యం అలాంటి ఆరోగ్యాన్ని ప్రజలందరూ కాపాడుకోవాలి ఎప్పటికప్పుడు డాక్టర్ని సంప్రదించాలని తెలియజేశారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సొనాల డాక్టర్ కే నవీన్ రెడ్డి , ఏఎన్ఎం కవిత, జమున, నర్సింగ్ ఆఫీసర్ ఎం జ్యోతి, ఫార్మసీ ఆఫీసర్ మనోహర్, హెల్త్ అసిస్టెంట్ లింగారెడ్డి, ఆశా వర్కర్స్, వైద్య సిబ్బంది వారు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు





# అసైన్‌మెంట్ భూమిలో అక్రమ లేఅవుట్!



- **అధికారుల అనుమతులు లేకుండానే 12 ప్లాట్లు.. యథేచ్ఛగా విక్రయాలు?**
- **రైతు భరోసా నిధులపైనా ఆరోపణలు.. రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులపై ఫిర్యాదు**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 7(డీడీ9 వార్త):**

బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో ప్రభుత్వ అసైన్‌మెంట్ భూమి వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది.ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి అసైన్‌మెంట్ భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారనే ఆరోపణలతో మండల ప్రజావాణి నోడల్ అధికారికి ఫిర్యాదు అందింది.అనుమతులు లేని లేఅవుట్, రైతు భరోసా నిధుల పొందడం, రాజకీయ జోక్యం, బెదిరింపులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారు కోరారు.సర్వే నంబర్ 30/5లో 2 ఎకరాల భూమి ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. బైరాపూర్ గ్రామానికి చెందిన గాదె శ్రీనివాస్‌కు సర్వే నంబర్ 30/5లో 2 ఎకరాల భూమి ప్రభుత్వం అసైన్‌మెంట్‌గా మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.అయితే గత నాలుగైదేళ్లుగా ఈ భూమిలో పంటలు సాగు చేయడం లేదని, అయినప్పటికీ భూమిపై రైతు భరోసా నిధులు పొందుతున్నారని ఆరోపించారు.

**పీవోటీ యాక్ట్ నిబంధనలు ఉల్లంఘించారా?**

అసైన్‌మెంట్ భూముల బదలాయింపుపై ఉన్న పీవోటీ యాక్ట్ నిబంధనలను ఉల్లంఘించి ప్రభుత్వ భూమిని విక్రయించిన అంశంపై పూర్తిస్థాయి విచారణ జరపాలని కోరారు.అసైన్‌మెంట్ భూమి విక్రయాలు చట్టబద్ధమేనా? ప్లాట్లుగా విభజించేందుకు ఎవరి అనుమతులు తీసుకున్నారు? రిజిస్ట్రేషన్లు జరిగాయా? అనే అంశాలపై అధికారులు విచారణ చేయాల్సిన అవసరం ఉందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు.

**రైతు భరోసా ఎలా వచ్చింది?**

భూమి నాలుగైదేళ్లుగా సాగులో లేకపోతే రైతు భరోసా నిధులు ఎలా జమ అయ్యాయి? అన్న ప్రశ్నను ఫిర్యాదుదారు లేవనెత్తారు.సదరు భూమికి సంబంధించిన రైతు భరోసా వివరాలను పరిశీలించి, అర్హత లేకుండా నిధులు పొందినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని కోరారు.

**నాలా లేదు.. లేఅవుట్ అనుమతి లేదు!**

మరోవైపు సదరు భూమికి నాలా (వ్యవసాయేతర భూమిగా మార్పిడి), లేఅవుట్ అనుమతులు లేకుండానే సుమారు 12 ప్లాట్లుగా విభజించి ఇతరులకు విక్రయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. భూమిపై ఎలాంటి అనుమతులు లేకపోయినా ప్లాట్లుగా విభజించి విక్రయించడం నిబంధనలకు విరుద్ధమని ఆరోపించారు.ఇప్పటికే పలువురు ప్లాట్లు కొనుగోలు చేసి ఉన్నారని, వారి వద్ద ఉన్న బాండ్ పేపర్లు, ఇతర పత్రాలను పరిశీలిస్తే అసలు వ్యవహారం వెలుగులోకి వస్తుందని ఫిర్యాదుదారు అధికారులను కోరారు.

**మిగిలిన భూమిపైనా కన్ను?**

ఇప్పటికే కొంత భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయించడంతో పాటు, మిగిలిన భూమిని కూడా ప్లాట్లుగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో ఆరోపించారు. దీనిని వెంటనే అడ్డుకుని, భూమిపై యథాతథ స్థితిని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వ్యవహారంపై ప్రశ్నిస్తున్న స్థానికులను, విచారణ కోరుతున్న వారిని గాదె శ్రీనివాస్ తమ్ముడు మాజీ ఉపసర్పంచ్ బెదిరిస్తూ మా అన్న టైగర్ ద్రోణవల్లి సతీష్, కాబోయే బాన్సువాడ ఎమ్మెల్యే, మా అన్న మాట రాష్ట్రపతి ముద్ర అంటూ ఏదైనా మా అన్న చెప్పినట్టే జరుగుతుంది.అంటూ స్థానికులను,విచారణ కోరుతున్నవారిని రాజకీయ ఒత్తిళ్లతో బెదిరిస్తున్నారనే ఆరోపణలు కూడా ఫిర్యాదులో ఉన్నాయి.అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఫిర్యాదుదారు కోరారు.






**భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్**

అసైన్‌మెంట్ నిబంధనలకు విరుద్ధంగా భూమి బదలాయింపు జరిగినట్లు విచారణలో తేలితే పీవోటీ యాక్ట్ ప్రకారం అసైన్‌మెంట్‌ను రద్దు చేసి, 2 ఎకరాల భూమిని తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని అధికారులను కోరారు.బైరాపూర్‌లోని ఈ 2 ఎకరాల అసైన్‌మెంట్ భూమి వ్యవహారంపై సమగ్ర విచారణ జరిగితేనే అసలు నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.ప్లాట్ల విక్రయాలు, అనుమతులు, రైతు భరోసా నిధులు, భూమి బదలాయింపు తదితర అంశాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## ప్రజావాణి ఫిర్యాదుల విభాగం

- **మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం**

**ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 07:(డిడి 9 వార్తా న్యూస్)**

ఆదిలాబాద్ జిల్లాలోని సొనాల మండలంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజావాణి ఫిర్యాదుల విభాగంలో ప్రజల ఫిర్యాదులను తీసుకున్నారు ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన లో 420 హామీలు 6 గ్యారంటీలు వైఫల్యం చెందినందున హామీలు ఇకనైనా నెరవేర్చాలని ఎం ఆర్ ఓ ఎం పి డి ఓ లకు మెమోరాండం అందించిన సొనాల బి ఆర్ ఎస్ నాయకులు ఎన్నికల హామీలో భాగంగా కాంగ్రెస్ పార్టీ 420 హామీలతో పాటు ఆరు గ్యారెంటీలు ఇస్తామని చెప్పి వెయ్యి రోజుల 1000 పాలన గడిచిపోయిన ఇప్పటికి హామీలు నెరవేర్చకుండా ప్రభుత్వం వైఫల్యం చెందిన సందర్భంగా సొనాల బి ఆర్ ఎస్ నాయకులు ఎం ఆర్ ఓ ఎం పి డి ఓ లకు విజ్ఞాన పత్రం అందించడం జరిగింది సి. రత్నాకర్ రావు ఎంపీడీఓ, సి మల్లేష్ ఎంఆర్ఓ, జి. దేవు ఎంఏఓ, శశిధర్ వెటర్నరీ డాక్టర్, డి. ఉమేష్ కుమార్ ఏఈఈ, బి. విజయ్ కుమార్ హెచ్‌డబ్ల్యుఓ, ఎస్. దత్తురాం సీఆర్‌పీ , ఎంఆర్‌సీ జి. మధు ఏఈ, హౌసింగ్ వి. సంజీవ్ ఏపీఎం, ఐకేపీ పి. శ్యామ్ ఏపీఓ కె. జంగుబాయ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి. చంద్రశేఖర్ సొనాల సర్పంచ్ బిందుజ సుధీర్ రెడ్డి సొనాల పట్టణ అధ్యక్షులు చిన్నయ్య, అభిలాష్,హరీష్,అఖిల్, రమేష్, ప్రదీప్, రాజన్న,సుగుణకర్,శరత్,గణేష్,పంచాక్షరీ,ప్రజలు,గ్రామస్తులు ఈ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు



## మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఏబీవీపీ సభ్యత్వ నమోదు

- **అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఎదులపురం జిల్లా బోథ్ శాఖ**
- **ఈరోజు బోథ్ మోడల్ స్కూల్ మరియు జూనియర్ కళాశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.**

**అదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 7: (డిడి 9 వార్త న్యూస్)**

అదిలాబాద్ జిల్లా బోథ్ స్థానిక మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీలో ఏబీవీపీ సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించారు
ఈ సందర్భంగా బోయిడి ఆకాష్ మాట్లాడుతూ, విద్యార్థి పరిషత్ వ్యక్తి నిర్మాణం ద్వారా జాతీయ పునర్నిర్మాణం అనే లక్ష్యంతో పని చేస్తుందని తెలిపారు. ఏబీవీపీ ప్రారంభమైన నాటి నుంచి విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తోందని పేర్కొన్నారు.
ఏబీవీపీ 77 ఏళ్ల ప్రస్థానంలో నిర్వహించిన వివిధ ఉద్యమాలు, సాధించిన విజయాల గురించి విద్యార్థులకు వివరించారు. నేడు ఏబీవీపీ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఆవిర్భవించిందని అన్నారు.
దేశాన్ని విశ్వగురు స్థానంలో నిలబెట్టడమే విద్యార్థి పరిషత్ ధ్యేయమని ఈ మహత్తర లక్ష్యంలో విద్యార్థులందరూ భాగస్వాములు కావాలని బోయిడి ఆకాష్ పిలుపునిచ్చారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో బోయిడి ఆకాష్, నితిన్, అరుణ్, అభి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.




## చిన్ముద్ర సేవా ట్రస్ట్ వార్షికోత్సవం

**కామారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 7(డిడి9 వార్త):**

అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి అయ్యప్ప గురుస్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శబరిమలలో ప్రతి నెల నిర్వహిస్తున్న మహా అన్నదాన కార్యక్రమం గురించి వివరించి, భక్తులు ధన, వస్తు, సేవా రూపాల్లో సహకరించాలని పిలుపునిచ్చారు.వివిధ జిల్లాల్లో సేవా కార్యక్రమాల విస్తరణకు నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు.కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు రుద్ర కోటేశ్వరరావు, అధ్యక్షులు పైల ఆది మోహన్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ కర్క సిద్దు, తెలంగాణ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు జంబుల సాయి ప్రసాద్, రాజుల రాజేష్ కుమార్, ఎర్రా రాజు, వెల్ది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు

- **అధికారులకు అదనపు కలెక్టర్ విక్టర్ ఆదేశం**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 7(డిడి9 వార్త):**

ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన ఫిర్యాదులు, వినతులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విక్టర్ అధికారులను ఆదేశించారు.సోమవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 58 ఫిర్యాదులు, వినతులను ఆయన స్వీకరించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నమ్మకంతో ప్రజావాణిని ఆశ్రయిస్తున్నందున, అధికారులు ప్రతి దరఖాస్తుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నిబంధనల మేరకు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించగల సమస్యలను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు.ఇతర శాఖల సమన్వయం అవసరమైన సమస్యలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని నిర్ణీత సమయంలో చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, సీఈఓ చందర్, ట్రైనింగ్ కలెక్టర్ రవితేజ, డీఆర్వో పాండు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వన మహోత్సవ లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వద్దు

- **నిర్దేశించిన గడువులోగా మొక్కలు నాటే లక్ష్యాలను పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 7(డిడి9 వార్త):**

జిల్లాలో వన మహోత్సవం కింద శాఖల వారీగా నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వన మహోత్సవం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు నాటిన మొక్కలు, శాఖల వారీగా సాధించిన పురోగతి, ఇంకా పూర్తి చేయాల్సిన లక్ష్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేటాయించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

జిల్లాలో పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ కోసం అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఎన్.వై. గిరి అన్నారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, నాటిన మొక్కలను సంరక్షించి వాటిని పెంచే బాధ్యతతో నిర్వహించాలని అధికారులకు సూచించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపైనా అదనపు కలెక్టర్ సమీక్షించారు. మండలాల వారీగా నిర్మాణ పనుల పరిస్థితి, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, జెడ్పీ సీఈవో చందర్, పీడీ దామోదర్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ రవితేజతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




# బోథ్ కేదార్నాథ్ శివాలయంలో శ్రావణమాస ఉత్సవాలు

**ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 7:( డిడి 9 వార్త న్యూస్)**

బోథ్ పట్టణ కేంద్రం లోని కేదార్నాథ్ శివాలయం లో శ్రావణ మాసం పురస్కరించుకుని శ్రావణ మాసం లోని ప్రతి సోమవారం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు శ్రావణ మాసం లోని చివరి సోమవారం కాబట్టి మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమం లో బోథ్ మరియు చుట్టు పక్క ప్రజలు పాల్గొన్నారు మరియు ఈ శ్రావణ మాసం లో సహకరించిన వారికి ఆలయ కమిటీ తరపున సత్కారం చేశారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు





# శివమయమైన ఏకచక్రేశ్వరాలయం.. వైభవంగా శ్రావణ సోమవారం, ఏకాదశి వేడుకలు

- **వేదఘోష, మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి రుద్రాభిషేకాలు**
- **భక్తుల పాదయాత్రలు.. రాత్రి భజన కార్యక్రమాలు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 07డీడీ9 వార్త):**



చారిత్రాత్మక బోధన్ పట్టణం ఆధ్యాత్మిక వెలుగులతో మైమరిచిపోయింది. శ్రావణమాసపు ఆఖరి సోమవారంతో పాటు పవిత్రమైన ఏకాదశి ఘడియలు ఒకే రోజు కలసి రావడం అత్యంత విశేషం కాగా, ఈ పవిత్ర పర్వదినాన శ్రీ ఏకచక్రేశ్వరాలయం శంభో శంకర నామ స్మరణలతో మారుమోగింది. తెల్లవారుజాము నుంచే బోధన్ పట్టణ వీధులు, గ్రామీణ బాటలన్నీ స్వామివారి దర్శనానికి తరలివెళ్లే భక్తుల పాదయాత్రలతో శివమయంగా మారాయి. ఆలయ ప్రధాన అర్చకులు గణేష్ శర్మ, మహేష్ పాఠక్, శివకుమార్‌ల ఆధ్యాత్మిక పర్యవేక్షణలో ఉదయాన్నే స్వామివారికి పవిత్ర జలాలతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నేత్రపర్వంగా సాగాయి. పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన 'అన్నపూజ'ను కన్నులపండువగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించిన భక్తజనం, ముఖ్యంగా మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. లోకకల్యాణార్థం, కుటుంబ సౌభాగ్యం, ఆయురారోగ్యాలు కాపాడాలని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించి వేదాశీర్వచనం పొందారు. ఈ ఏడాది శ్రావణ సోమవారానికి ఏకాదశి తోడవడంతో దీని ప్రాముఖ్యత మరింత పెరిగింది. దీంతో బోధన్ చుట్టుపక్కల మండలాలలోని పలు గ్రామాల నుంచి భక్తులు మైళ్ల కొద్దీ కాలిబాటన పాదయాత్రగా ఆలయానికి చేరుకోవడం విశేషం. దారిపొడవునా శివనామస్మరణ చేస్తూ భక్తులు పరవశించిపోయారు. ఆలయానికి వచ్చిన భక్తులందరికీ మధ్యాహ్నం మహామంగళహారతి అనంతరం పెద్ద ఎత్తున అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం స్వామివారిని శోభాయమానంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. రాత్రి వేళ భక్తులు ఆలపించిన ఆధ్యాత్మిక భజనలు, కీర్తనలు భక్తిరసాన్ని కురిపించాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. రాములు, అభివృద్ధి కమిటీ ప్రతినిధులు లక్ష్మణ్ రావు పటేల్, ఆరుగొండ శంకర్, సున్నం గంగాధర్, జక్కం వీరప్ప, ఈరపురం మౌనిక పోశెట్టి మరియు ఆలయ సిబ్బంది సుధాకర్, చంద్రకళ, పుష్ప తదితరులు భక్తులకు తాగునీరు, వసతులు కల్పించి పూజా కార్యక్రమాలను విజయవంతం చేశారు.



# బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడికి బోథ్ లో నిరసన

- **అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం**
- **బోథ్ నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం**

**ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: సెప్టెంబర్ 7: (డిడి9 వార్త న్యూస్)**

గౌరవ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్* గారి పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రంలో బోథ్,సొనల మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజల తరపున ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం సరికాదని ముఖ్యంగా మహిళా ప్రజాప్రతినిధులపై అసెంబ్లీ ప్రాంగణంలోనే దాడి జరగడం అత్యంత బాధాకరం అని . ఈ ఘటనను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని మహిళా ప్రజాప్రతినిధులకు జరిగిన అవమానానికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని బోథ్,సొనల మండల బీఆర్ఎస్ పార్టీ తరుపున డీమాండ్ చేశారు.అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎంపిడిఓ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు స్వామి, మాజీ సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్,బోథ్ పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్,సొనల సర్పంచ్ బిందుజ సుధీర్ రెడ్డి, విడిసి చైర్మన్ పోతన్న, సర్పంచ్ లు బాబేరా తండా రూప్చంద్, బాబేరా పద్మ రవీందర్, కంటేగావ్ సంజీవ్,నింగిని జాదవ్ పద్మ రవీందర్,పోచెర సర్పంచ్ రేఖరాజు రెడ్డి, కరత్వాడ విశ్వేశ్, మర్లపల్లి అంబాజీ , మండబొగుడ బాబులాల్,బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్,కుచులాపూర్ చంద్ర మోహన్, దన్నూర్ అసలా సదాశివ , జక్క బాపురెడ్డి, సిరీసే సంజీవ్, బత్తుల రమేష్,ఈర్లా అభిలాష్,తుల హరీశ్,గంగమల్లు,రఫీ, ఇఫ్తెకర్, ఫిరోజ్ ఖురేషి,మాజీ ఆత్మ చైర్మన్ సుభాష్,ఉప సర్పంచ్ లు అందురు మామిడిపల్లి సంతోష్, కనుగుట్ట నవ్వ రవీందర్,సొనల శ్రీకాంత్,విజయ్ కుమార్ , గోపాల్,రాము జాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- **అనామలీస్, అన్‌మ్యాపింగ్ జాబితాల్లో నోటీసులు అందుకున్న వారికి హియరింగ్ నిర్వహించాలి**
- **సీఈఓ సుదర్శన్‌రెడ్డి**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 7(డిడి9 వార్త):**



ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అనామలీస్, అన్‌మ్యాపింగ్ జాబితాల్లో నోటీసులు జనరేట్ అయిన ఓటర్లకు నోటీసులు అందజేయడం, హియరింగ్ నిర్వహణ, ఆమోదించిన దరఖాస్తులపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సోమవారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనామలీస్, అన్‌మ్యాపింగ్ జాబితాల్లో నోటీసులు నమోదైన వాటిని సంబంధిత ఓటర్లకు అందజేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సీఈఓ ఆదేశించారు. నోటీసులు అందుకున్న వారికి హియరింగ్ నిర్వహించి, వారు సమర్పించిన డాక్యుమెంట్లను బీఎల్ఓల ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు డేటా ఎంట్రీ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ నోటీసులను సంబంధిత ఓటర్లకు అందజేస్తూ హియరింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్నట్లు వెల్లడించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, శిక్షణ కలెక్టర్ రవితేజ, సూపరింటెండెంట్ రాజేశ్వర్, తహసీల్దార్ హిమబిందు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొన్న ద్విచక్రవాహనం

**బాన్సువాడ, సెప్టెంబర్ 7(డిడి9 వార్త):**

ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఎక్సెల్ పై ప్రయాణిస్తున్న తల్లీ, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి .ఈ ఘటన బీర్కూర్-పోతంగల్ ప్రధాన రహదారిపై బరంగేడ్గి డాబా సమీపంలో సోమవారం చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బరంగేడ్గి డాబా వద్ద ఆర్టీసీ బస్సు రహదారి పక్కన ఆగి ఉండగా, శ్రావణ మాసం సందర్భంగా దేవాలయాలకు వెళ్లి తిరిగి వారి స్వగ్రామం సాగరోల్లికి వెళ్లే అదే మార్గంలో ఎక్సెల్ ద్విచక్రవాహనంపై వెళ్తున్న తల్లీ, కుమారుడు అదుపుతప్పి బస్సును ఢీకొన్నారు.ప్రమాదంలో ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా, పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు.గాయపడిన ఇద్దరిని చికిత్స నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.






# సాలూర మండలం నుంచి ఏకచక్రేశ్వరాలయానికి తరలిన భక్తజనం

**బోధన్, నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 07డీడీ9 వార్త):**

శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని సాలూర మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి ఏకచక్రేశ్వరాలయానికి భక్తులు తరలివెళ్లారు. సాలూర మండలంలోని మందర్న, హుంసా, ఖాజపూర్, సాలూర గ్రామాల నుంచి ఉదయాన్నే భక్తులు శోభాయాత్రగా కాలినడకన బయల్దేరి బోధన్ పట్టణంలోని ప్రసిద్ధ ఏకచక్రేశ్వర ఆలయానికి చేరుకున్నారు. దారిపొడవునా శివనామస్మరణతో పరిసరాలు మారుమోగాయి. ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా పాదయాత్రగా వెళ్తున్న భక్తుల సౌకర్యార్థం కాంగ్రెస్ పార్టీ సాలూర మండల అధ్యక్షుడు మందర్న రవి ఆధ్వర్యంలో సాలూర క్యాంప్ వద్ద ప్రత్యేకంగా ఫలహారాలు, అల్పాహారాన్ని అందజేశారు. దారిన వెళ్తున్న భక్తులందరికీ అల్పాహారం పంపిణీ చేసి సేవలు అందించారు. అనంతరం మందర్న రవి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో ఏకచక్రేశ్వరుడి దర్శనానికి వెళ్లే భక్తులకు తనవంతు సహాయంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టడం ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. స్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# హామీలు నెరవేర్చకపోతే ఉద్యమం తప్పదు: బీఆర్ఎస్

- **బోధన్ ఆర్డీఓ ఆఫీస్ ఎదుట భారీ ధర్నా**
- **ఆర్డీఓ విజయకుమారికి వినతిపత్రం అందజేత**

**బోధన్, నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 07డీడీ9 వార్త):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అయేషా ఫాతిమా ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బోధన్‌లో బీఆర్ఎస్ శ్రేణులు హోరెత్తించాయి. అచ్చన్‌పల్లి నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ముట్టడించి ధర్నా చేపట్టారు. ఆర్డీఓ విజయకుమారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అయేషా ఫాతిమా మాట్లాడుతూ.. 100 రోజుల్లో హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్, ఇప్పుడు ప్రజలను విస్మరించి మోసం చేస్తోందని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీకి వెళ్తున్న ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం దారుణమన్నారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, వివిధ మండలాల అధ్యక్షులు సంజీవ్, నర్సింగ్‌రావు, శ్రీరామ్, భూమారెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మి, అశోక్ రెడ్డి, మోబీన్, నాయకులు తెడ్డు పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.





# ఊట్‌పల్లి ఎస్సీ కాలనీలో డ్రైనేజీ పనులు ప్రారంభం

- **ఊట్‌పల్లి ఎస్సీ కాలనీలో డ్రైనేజీ పనులు ప్రారంభం**
- **రూ.5 లక్షల నిధులతో మౌలిక వసతుల కల్పన**

**బోధన్, నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 07డీడీ9 వార్త):**

గ్రామాల్లోని అన్ని కాలనీలలో పారిశుద్ధ్య సమస్యలు నివారించి మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని ఊట్‌పల్లి సర్పంచ్ ప్రశాంతి తిరుమలేష్ పేర్కొన్నారు. బోధన్ మండలం ఊట్‌పల్లి గ్రామంలోని 3వ వార్డు ఎస్సీ కాలనీలో రూ.5 లక్షల పంచాయతీ నిధులతో చేపడుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు సోమవారం ఆమె కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. ఎస్సీ కాలనీలో దీర్ఘకాలంగా నెలకొన్న మురుగునీటి సమస్యకు ఈ డ్రైనేజీ నిర్మాణంతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని, అందుకే పారిశుద్ధ్య పనులకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. గ్రామ వికాసానికి, ప్రజల సంక్షేమానికి నిరంతరం అందుబాటులో ఉంటూ కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నరేందర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి పృథ్వీరాజ్, వార్డు సభ్యులు, గ్రామ ముఖ్యాధికారులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికే 'ప్రజావాణి': ఎంపీడీవో నర్సయ్య

**బోధన్, నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 07(డీడీ9 వార్త):**

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని సాలూర ఎంపీడీవో నర్సయ్య పేర్కొన్నారు. సాలూర మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుంచి రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు బదిలీ చేసి, వీలైనంత త్వరగా పరిష్కరించేలా చొరవ చూపుతామన్నారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యలపై అధికారుల దృష్టికి తెచ్చేందుకు ప్రజావాణిని ఒక ఉత్తమ వేదికగా ఉపయోగించుకోవాలని సూచించారు. అర్జీదారులు మండల కేంద్రానికి వచ్చి తమ సమస్యలను నేరుగా అధికారులకు విన్నవించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## నేడు దివ్యాంగ విద్యార్థులకు ఉచిత పరికరాల ఎంపిక శిబిరం

- **అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ఎంఈఓ నాగయ్య**

**బోధన్, నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 07(డీడీ9 వార్త):**

బోధన్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఉచితంగా సహాయ ఉపకరణాలు అందించేందుకు ఆలింకో సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక గుర్తింపు, నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈఓ నాగయ్య తెలిపారు. రైల్వే గేట్ వద్ద గల ప్రభుత్వ జేసీ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని వివరించారు. డివిజన్ పరిధిలోని బోధన్, ఎడపల్లి, రెంజల్, సాలూర, రుద్రూర్, కోటగిరి, పోతంగల్, వర్ని, చందూర్ మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల దివ్యాంగ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. శిబిరానికి వచ్చే విద్యార్థులు యుడిఐడి కార్డు, సదరమ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులతో పాటు 4 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు వెంట తీసుకురావాలని సూచించారు. గత సంవత్సరం ఇదే శిబిరానికి హాజరై ప్రయోజనం పొందిన విద్యార్థులు తిరిగి రావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పేద, ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతులకు చెందిన దివ్యాంగ విద్యార్థుల చదువుకు, సౌకర్యాలకు ఈ ఉపకరణాలు ఎంతగానో దోహదపడతాయని, కావున తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సహకారంతో పిల్లలను శిబిరానికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం కోసం ఎంఈఓ 94400 92665, స్పెషల్ ఎడ్యుకేటర్ డాక్టర్ విశ్వనాథ్ మహాజన్ 99494 89797లను సంప్రదించవచ్చని తెలిపారు.

## యువత కొలువుల కలలకు పోలీస్ శాఖ బాసట

- **గిరిరాజ్ కళాశాలలో ఉచిత రిక్రూట్‌మెంట్ శిక్షణను ప్రారంభించిన సీపీ సాయిచైతన్య**
- **200 మందికి 60 రోజుల పాటు పక్కా ప్రణాళికతో శిక్షణ**

**నిజామాబాద్ జిల్లా(డీడీ9 వార్త):**




తెలంగాణ పోలీస్ శాఖలో ఎస్సై, కానిస్టేబుల్ కొలువులే లక్ష్యంగా ముందుకు సాగుతున్న నిరుద్యోగ యువతకు నిజామాబాద్ కమిషనరేట్ పోలీస్ శాఖ అండగా నిలిచింది. 200 మంది అభ్యర్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ 60 రోజుల ఉచిత ప్రీరిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య సోమవారం గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. నిరుద్యోగ యువతకు నాణ్యమైన విద్య, శిక్షణ అందించడం పోలీస్ శాఖ సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన భాగ్యకిరణ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులు జరుగుతాయని వెల్లడించారు. సబ్జెక్టుపై పట్టు సాధించడంతో పాటు పోటీ పరీక్షల భయాన్ని పోగొట్టి విజయం సాధించేలా మెలకువలు నేర్పిస్తామన్నారు. ఈ 60 రోజులను సువర్ణావకాశంగా భావించి కష్టపడి చదివి లక్ష్యాన్ని ముద్దాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిరాజ్ కాలేజీ ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి, ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ భాగ్యకిరణ్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, సీటీసీ ఏసీపీలు ప్రకాష్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్, డీఎస్పీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, సీఐలు శ్రీనివాస్ రాజ్, సతీష్ కుమార్, శ్రీనివాస్, శ్రీలత, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఓటర్ల విచారణ పారదర్శకంగా జరగాలి

- **వీడియో కాన్ఫరెన్స్‌లో సీఈవో సుదర్శన్ రెడ్డి స్పష్టం**
- **ఎస్ఐఆర్ పురోగతిపై కలెక్టర్లతో సమీక్ష**

**నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 07(డీడీ9 వార్త):**






ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో భాగంగా అనామలీస్, నో మ్యాపింగ్ కేటగిరీ కింద గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు అందజేసి, పక్కాగా మార్గదర్శకాలు పాటిస్తూ పారదర్శకంగా విచారణ నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ.. నోటీసుల అందజేత, పంపిణీ అనంతరం సంబంధిత ఓటర్లకు తమ వివరణ ఇచ్చేందుకు తగిన సమయం కల్పించాలని సూచించారు. నిబంధనల ప్రకారం వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తలు వహించాలని స్పష్టం చేశారు. ప్రతి కేసుకు సంబంధించిన సమాచారాన్ని ఆన్‌లైన్/పత్రాల్లో సక్రమంగా నమోదు చేసి, నిర్ణీత గడువులోగా విచారణ ప్రక్రియను ముగించాలని ఆదేశించారు. వీసీలో పాల్గొన్న నిజామాబాద్ ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతంగా పురోగతిలో ఉందని తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా అనుసరిస్తూ సమయానుకూలంగా విచారణ పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని సీఈవోకు వివరించారు. నిజామాబాద్ కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ భుజంగరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## భక్తిపారవశ్యంలో వాసవిమాత సన్నిధి

**బోధన్, నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 07(డీడీ9 వార్త):**

బోధన్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది. ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలను సోమవారం అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల రంగురంగుల పుష్పాలు, విద్యుత్ దీప కాంతులతో మనోహరంగా అలంకరించారు. ఉదయాన్నే అర్చకుల వేదఘోష నడుమ అమ్మవారికి దివ్య అభిషేకాలు జరిపారు. అనంతరం విశ్వశాంతిని, భక్తుల శ్రేయస్సును కాంక్షిస్తూ శ్రీ లలితా సహస్రనామ పారాయణము, విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ఓడిబియ్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కుబడులు చెల్లించుకున్నారు. మహా హారతి అనంతరం భక్తులకు కడుపారా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు కొత్త రాజేశ్వర్ గుప్తా, పబ్బ మురళి, కంటాల రమేష్, వాసర గంగాధర్, సంతోష్, కిరణ్, నాగ దుర్గ ఆంజనేయులతో పాటు ఆర్యవైశ్య ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## సర్కారు బడుల్లో సురక్షిత తాగునీరు అందించాలి: టీజీవీపీ

**నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 07(డీడీ9 వార్త):**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శుద్ధి చేసిన తాగునీటిని తక్షణమే అందించాలని తెలంగాణ విద్యార్థి పరిషద్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం టీజీవీపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్ విలేకరులతో మాట్లాడారు. శంకర్ భవన్‌లోని బడితో పాటు పలు పాఠశాలల్లో వాటర్ ఫిల్టర్లు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు నేరుగా బోరు బావి నీటినే తాగుతున్నారని తెలిపారు. ఈ కలుషిత నీటి కారణంగా చిన్నారులు తరచూ జ్వరాలు, కడుపునొప్పితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆహారం లేకున్నా ఒక్క పూట ఉండగలమని, కానీ తాగేందుకు స్వచ్ఛమైన నీరు లేకపోతే ప్రాణాలకే ప్రమాదమని అన్నారు. సమస్యను ఆలకించిన జిల్లా కలెక్టర్ స్పందిస్తూ.. సర్కారీ పాఠశాలల్లో ఫిల్టర్ నీరు అందించేందుకు తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ జిల్లా కార్యదర్శి వినయ్, ప్రతినిధులు సాయి, నైతిక తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- **అదనపు కలెక్టర్ భుజంగరావు ఆదేశం**
- **కలెక్టరేట్ ప్రజావాణికి 116 దరఖాస్తులు**

**నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 07(డీడీ9 వార్త):**

ప్రజావాణి కార్యక్రమానికి అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన బాధితుల నుంచి మొత్తం 116 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. బాధితులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావుతో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాసరావులకు విన్నవించుకుని అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు సమర్పించిన అర్జీలను ఏమాత్రం పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలిస్తూ వేగవంతంగా పరిష్కార మార్గాలు చూపాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## గణేశ్ మండప నిర్వాహకులు నిబంధనలు పాటించాలి: సీపీ

**నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 07(డీడీ9 వార్త):**

గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, మండపాల నిర్వాహకులు పోలీస్ మార్గదర్శకాలను ఆక్షరాలా పాటించాలని నిజామాబాద్ సీపీ సాయి చైతన్య తెలిపారు. ఉత్సవాల వేళ శబ్ద కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సమగ్ర నిబంధనల జాబితాను సోమవారం పత్రికా ప్రకటన ద్వారా వెలువరించారు. డీజేలపై సంపూర్ణ నిషేధం విధించినట్లు సీపీ స్పష్టం చేశారు. వయోవృద్ధులు, అనారోగ్య బాధితులు, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రాత్రి 10 గంటల తర్వాత మైకులు కట్టేయాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులను గుర్తుచేశారు. మహిళల రక్షణ కోసం ఈవ్ టీజింగ్ నిరోధక చర్యలు చేపట్టాలని, మండపాల వద్ద రాత్రింబవళ్లు పహారా ఉండాలని సూచించారు. మంటలకు తావులేకుండా నాణ్యమైన విద్యుత్ వైరింగ్, రేకులు లేదా వర్షం పడకుండా పాలిథిన్ కవర్ల షెడ్లు నిర్మించాలని తెలిపారు. మద్యపానం, పేకాట, టపాసులు కాల్చడాన్ని పూర్తిగా నిషేధించినట్లు పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే డయల్ 100 లేదా కంట్రోల్ రూమ్ నెంబర్ 8712659700ను సంప్రదించాలని పిలుపునిచ్చారు.

## ఉప్లూర్ లయన్స్ నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

**నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 07(డీడీ9 వార్త):**

పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యసేవలు అందించడంలో లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ రాష్ట్ర సభ్యుడు బస వేణుగోపాల్ యాదవ్, ఉప్లూర్ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ అన్నారు. కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామంలోని శ్రీ బలరాజేశ్వర స్వామి ఆలయం వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ కమ్మర్‌పల్లి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు లయన్ డాక్టర్ అజయ్ నేతృత్వంలో 122 మంది రోగులకు పరీక్షలు జరిపారు. ఇందులో 33 మంది మోతిబిందు సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. బాధితులకు ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించి, తిరిగి సొంత ఊరికి చేరవేస్తామని లయన్స్ క్లబ్ బాధ్యులు స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు జెల్ల సదానంద్, ఉపసర్పంచ్ తక్కురి ముత్యం, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తెడ్డూ రమేష్, ప్రధాన కార్యదర్శి హైమద్, కోశాధికారి విజయ్ కుమార్, డిస్ట్రిక్ చైర్మన్ లుక్కా గంగాధర్, కార్యవర్గ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




## ఆడపిల్ల జన్మిస్తే సొంత నిధులతో సాయం: డాక్టర్ హకీమ్

- **మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సమక్షంలో రూ.5 వేలు, కిట్ అందజేత**

**పొతంగల్, నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 07(డీడీ9 వార్త):**

ఆడపిల్ల జన్మిస్తే భారంగా భావించకుండా ఆదుకునేందుకే ఆర్థిక సాయం, పసిపాప కిట్ అందజేస్తున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ ఎం.ఎ.హకీమ్ తెలిపారు. పాత పోతంగల్ గ్రామానికి చెందిన దంపతులు దేవత, బబ్లు దంపతులకు ఆడపాప జన్మించడంతో పోతంగల్ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ చేతుల మీదుగా రూ.5 వేల నగదు, పసిపాప సంరక్షణ కిట్‌ను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో ఆడబిడ్డ పుడితే లక్ష్మీదేవిగా భావించి కేసీఆర్ కిట్ అందించేవారని గుర్తుచేశారు. ఆ పథకం నిలిచిపోవడంతో కేటీఆర్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా పోతంగల్ మండల పరిధిలోని ఏ గ్రామంలోనైనా ఆడపిల్ల పుడితే తన సొంత నిధులతో రూ.5 వేలు, కిట్ ఇస్తానని ఇచ్చిన మాట ప్రకారం ఈ సాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట ఆగన్న, మాజీ రైతుబంధు అధ్యక్షుడు అంజన్న, శ్రీనన్న, మాజీ జడ్పీటీసీ నార్ల రత్నాకర్, మోరీల్ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుదం నవీన్, జుభేర్, తెల్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ ప్రజావాణికి 37 ఫిర్యాదులు

**నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 07(డీడీ9 వార్త):**

నిజామాబాద్ నగరంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి 37 ఫిర్యాదులు అందినట్లు పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులతో సీపీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విన్నారు. అనంతరం సీపీ సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్సైలకు ఫోన్ చేసి మాట్లాడారు. ఫిర్యాదుల స్థితిగతులపై విచారించి, చట్ట ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి దళారులు, పైరవీకారులను ఆశ్రయించకుండా నేరుగా పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు.




ప్రజలకు మరింత చేరువవుతూ, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తోందన్నారు. ప్రతి సోమవారం ప్రజావాణి ద్వారా నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తామని స్పష్టం చేశారు.

# బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించిన మణుగూరు బిఆర్ఎస్ నేతలు..

- **ఇది ప్రజాస్వామ్యమా, లేక నియంతృత్వమా.?.**

**మణుగూరు. సెప్టెంబర్ 7(డి డి 9వార్త)**

బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,శాసనసభాపక్ష ఉపనేత హరీష్ రావు తో పాటు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని మణుగూరు మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సంఘటనను నిరసిస్తూ,మణుగూరు పట్టణం లోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,
మహిళా ఎమ్మెల్యేలు అని కూడా చూడకుండా చీరలు పట్టుకుని లాగడం, జట్టు పట్టుకుని లాగడం వంటి చర్యలు అమానవీయ సంఘటన అని, అలాగే మాజీ హోంశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని పురుష పోలీసులతో అరెస్ట్ చేయడం దుర్మార్గపు చర్య అని వారు మండిపడ్డారు.పోలీసుల తోపులాటలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు గాయాలు కావడం బాధాకరమన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కుతూ,బలవంతపు అరెస్టులు చేయడం ఏ రకమైన ప్రజాస్వామ్యం అని నేతలు ప్రశ్నించారు."ఇది ప్రజాస్వామ్యమా, లేక నియంతృత్వ పరిపాలనా" అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రతిపక్ష నాయకులు, ప్రజా ప్రతినిధులు పట్ల ప్రభుత్వం అణచివేత ధోరణి విడనాడాలని, తక్షణమే అక్రమ అరెస్టులను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మణుగూరు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, టౌన్ అధ్యక్షుడు కుంట లక్ష్మణ్, మాజీ జెడ్పీటీసీ పోశం నరసింహారావు,వట్టం రాంబాబు, ముత్యంబాబు, ఎడ్ల శ్రీనివాస్, అడపా అప్పారావు, వేల్పుల కృష్ణ, ఆవుల నరసింహారావు, మేకల రవి, జావేద్ పాషా, సఖిని బాబూరావు,కాటిబోయిన సుజాత తదితరులు పాల్గొన్నారు.






# పోతంగల్‌లో బీఆర్ఎస్ 'రణభేరి'

- **పోతంగల్‌లో బీఆర్ఎస్ 'రణభేరి'**
- **కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై మండిపడ్డ గులాబీ శ్రేణులు**

**పోతంగల్, నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 07(డీడీ9 వార్త):**

కాంగ్రెస్ ప్రభుత్వం తమ వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం పోతంగల్ మండల కేంద్రంలో 'రణభేరి' నిరసన కార్యక్రమం హోరెత్తింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించి కాంగ్రెస్ సర్కార్ తీరును నిలదీశాయి. ఎన్నికల సమయంలో ప్రకటించిన 420 హామీలు, ఆరు గ్యారెంటీల అమలుపై ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. వంద రోజుల్లో మార్పు తెస్తామని చెప్పి అధికారం చేపట్టిన కాంగ్రెస్, వెయ్యి రోజులు గడిచినా ప్రజలకు నరకం చూపుతోందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో తెచ్చిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను నిలిపివేసి అవినీతి పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఏ.హాకీమ్‌లు మాట్లాడుతూ.. రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, 2 లక్షల ఉద్యోగాల భర్తీతో పాటు ఆడపిల్లల పుట్టుకపై అందిస్తామన్న కానుకలు ఏమయ్యాయని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా ప్రచారార్భాటాలకు పరిమితమయ్యారని మండిపడ్డారు. హామీలను నెరవేర్చకపోతే గ్రామగ్రామాన ప్రజలను చైతన్యపరిచి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సూదం నవీన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## 41 వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా.. మంగళవారం (నేడు) నాడు మణుగూరు ఏరియా ఆసుపత్రి నందు కంటి వైద్య శిబిరం.

**మణుగూరు. సెప్టెంబర్ 7(డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు లోని ఏరియా ఆసుపత్రి (వంద పడకల ఆసుపత్రి) లో 8 వ తేదీ మంగళవారం (నేడు) నాడు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని ,నియోజకవర్గ ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సంజీవరావు విజ్ఞప్తి చేశారు.41 వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా నేడు ఏరియా హాస్పిటల్ మణుగూరు నందు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని, ఈ శిబిరంలో కంటి శుక్లాలు కలవారిని గుర్తించి వారికి త్వరలో ఉచిత కంటి ఆపరేషన్ లు చేయించబడును అని ఆయన తెలిపారు. కావునా పినపాక,
కరకగూడెం,మణుగూరు,అశ్వాపురం,బూర్గంపాడు, గుండాల, ఆళ్లపల్లి మండలాల ప్రజలు ఏరియా ఆసుపత్రి మణుగూరు నందు కంటి వైద్య పరీక్షలు చేయించుకోవలసిందిగా మణుగూరు ఏరియా హాస్పిటల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ డాక్టర్ సంజీవరావు తెలియచేశారు.

# మణుగూరులో "ఆకతాయి గ్యాంగులకు" అడ్డుకట్ట ఎప్పుడు...

- **గంజాయి, డ్రగ్స్.. రాష్ డ్రైవింగ్‌పై ఉక్కుపాదం మోపాలి..**
- **మహిళలు, విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేయాలి.**
- **శివ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరపాలి.**
- **ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజుకు..**
- **వినతిపత్రం అందజేసిన మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ.**

**మణుగూరు. సెప్టెంబర్ 7(డి డి 9వార్త)**

మణుగూరు పట్టణంలో కొంతకాలంగా యువకులు గ్యాంగులుగా సంచరిస్తున్నారనే ఆరోపణలు, గంజాయి-మాదకద్రవ్యాల వినియోగంపై వస్తున్న ఫిర్యాదులు, రాష్ డ్రైవింగ్‌తో మహిళలు, విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఆందోళనల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ డిమాండ్ చేశారు.
ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల మణుగూరులో యువకుడు శివ మృతి చెందిన ఘటన ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలను వెలికితీసేందుకు సమగ్ర దర్యాప్తు చేపట్టి, ఎవరైనా బాధ్యులుగా తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**కాలేజీలు వదిలే వేళ.. రోడ్లపై 'రేస్'లా..!**

ముఖ్యంగా సాయంత్రం 4గంటల సమయంలో కాలేజీలు వదిలే వేళ, కొంతమంది యువకులు ద్విచక్ర వాహనాలపై ముగ్గురు, నలుగురు కలిసి ప్రయాణిస్తూ రాష్ డ్రైవింగ్ చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని దుర్గ తెలిపారు. దీంతో మహిళలు, విద్యార్థినులు రోడ్లపై ప్రయాణించేందుకు భయపడే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.
"టూ వీలర్ చలాన్లపై చూపుతున్న శ్రద్ధలో కొంతైనా గంజాయి, డ్రగ్స్, గ్యాంగ్ కార్యకలాపాలు, రాష్ డ్రైవింగ్, మహిళల భద్రతపై చూపాలి" అని ఆమె పోలీసు అధికారులను కోరారు.

**యాంటీ డ్రగ్' టీమ్‌లు రంగంలోకి రావాలి**

మణుగూరు పట్టణంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ వినియోగం, సరఫరాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, అవసరమైతే ప్రత్యేక యాంటీడ్రగ్ పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలని దుర్గ డిమాండ్ చేశారు.
అదేవిధంగా గ్యాంగులుగా తిరుగుతున్న యువకుల కార్యకలాపాలపై నిఘా పెట్టేందుకు ప్రత్యేక పోలీసు టీమ్‌లను ఏర్పాటు చేసి, కాలేజీలు, విద్యార్థినులు, మహిళలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో సాయంత్రం వేళల్లో పోలీసు గస్తీని పెంచాలని కోరారు.

**పోలీసు పోస్టింగులపైనా సమీక్ష అవసరం**

ఒకే ప్రాంతంలో దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది పోస్టింగులను నిబంధనల ప్రకారం ఉన్నతాధికారులు సమీక్షించాలని ఆమె సూచించారు. పోలీసు వ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా అధికారులు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు.
"మణుగూరులో 'గ్యాంగ్' అనే భయపెట్టే సంస్కృతికి పూర్తిగా అడ్డుకట్ట వేయాలి. మహిళలు, విద్యార్థినులు ఎలాంటి భయం లేకుండా రోడ్లపై తిరిగే పరిస్థితి కల్పించాలి. ప్రజల భద్రత విషయంలో ఇకపై నిర్లక్ష్యానికి తావుండకూడదు. గంజాయి, డ్రగ్స్, రాష్ డ్రైవింగ్, అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలి" అని పాల్వంచ దుర్గ స్పష్టం చేశారు.



# స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై తాతా మధు అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం..

- **పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు. సెప్టెంబర్ 7(డి డి 9వార్త)**



తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, దళిత నాయకుడు గడ్డం ప్రసాద్ కుమార్ ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలను పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన అసెంబ్లీ స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. ఒక ఎమ్మెల్సీగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి అసెంబ్లీ ప్రాంగణం వద్ద పోలీసులను దూషిస్తూ, స్పీకర్ గారిని కించపరిచే విధంగా అసభ్య పదజాలం ఉపయోగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ ను అవమానించేలా మాట్లాడటం అత్యంత బాధాకరమని, ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో తీవ్ర ఆవేదనకు కారణమవుతున్నాయని పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు హుందాతనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని, అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా రాజ్యాంగ సంస్థలను, వాటి పదవులను గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు.
తాతా మధు వ్యాఖ్యలపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, చట్టం ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే ఈ ఘటనపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ గారు స్పందించి, స్పీకర్ గారికి మరియు దళిత సమాజానికి జరిగిన అవమానంపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని పాయం వెంకటేశ్వర్లు అన్నారు.రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలానికి తావు ఇవ్వకూడదని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హితవు పలికారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు.

# చేయూత పింఛన్ల పెంపుపై అసెంబ్లీలోనే ప్రకటించాలి

- **సెప్టెంబరు 23న కలెక్టరేట్ల ముట్టడి**
- **ఎన్‌పీఆర్‌డీ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.అడివయ్య**

**బోధన్, నిజామాబాద్ జిల్లా సెప్టెంబర్ 07(డీడీ9 వార్త):**

అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగులతో పాటు చేయూత లబ్ధిదారులకు పింఛన్ల పెంపుదలపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. సోమవారం బోధన్‌లోని అప్నా గార్డెన్‌లో జెర్కొని రాజు అధ్యక్షతన జరిగిన ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర విస్తృత సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే పింఛన్ల పెంపుపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే జిల్లాల్లో పర్యటించే మంత్రులను, ఎమ్మెల్యేలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రజాపాలన పేరుతో పదేపదే దరఖాస్తులు స్వీకరించడం తప్ప కొత్త పింఛన్లు ఇచ్చింది లేదన్నారు. లక్షలాది మందికి పింఛన్లు రద్దు చేసి నిరుపేదలను మోసం చేశారని మండిపడ్డారు. యూడీఐడీ కార్డుల పేరుతో అర్హులైన వికలాంగుల సర్టిఫికేట్లను రద్దు చేయడం దారుణమన్నారు. 2016 ఆర్పీడబ్ల్యూడీ చట్టాన్ని వెంటనే అమలు చేస్తూ రాష్ట్రస్థాయి అడ్వైజరీ బోర్డును నియమించాలని, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, స్వయం ఉపాధికి రూ.10 లక్షల రుణాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 23న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ నాయకులు వై.గంగాధర్, గైని రాములు, షేక్ నజీర్, సాయమ్మ, గోపాల్, హన్మాండ్లు, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ బలోపేతానికి ఏడెల్లి కార్తీక్‌కు కీలక బాధ్యతలు

- **జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ సహాయ కార్యదర్శిగా నియామకం**

**జనగామ సెప్టెంబర్ 7 (డిడి 9 వార్త )బ్యూరో**



జనగామ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా సహాయ కార్యదర్శిగా ఏడెల్లి కార్తీక్ నియమితులయ్యారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఎస్సీ వర్గాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారి హక్కులు, సంక్షేమం కోసం పనిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ వేముల మల్లేష్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# 1000 రోజులు గడిచిన. హామీలు గాలిలోనే..

- **హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలం..**
- **వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలి: బీఆర్ఎస్ డిమాండ్**

**సెప్టెంబర్ 07 డిడి9 వార్త వెంకటాపురం.**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వెంకటాపురం మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండల కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.
ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గంప రాంబాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లలో ఎన్ని అమలు చేశారో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.
హామీల అమలుపై ప్రజలను మభ్యపెట్టకుండా ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ ప్రజాప్రతినిధులు, సర్పంచులు షోలం హోంపతి, పూజారి ఆదిలక్ష్మి, వీఆర్‌కే పురం సర్పంచ్ రమ్య, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు మంచర్ల నాగేశ్వరావు, బట్ట నాగేందర్, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సోనాలలో శ్రావణమాస ఉత్సవాలు

**ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: సెప్టెంబర్ 07: (డిడి 9 వార్తా న్యూస్):-**

ఆదిలాబాద్. జిల్లా సోనాల మండలంలో శ్రావణమాసం పురస్కరించుకొని సోనాల లోని శ్రీ రామాలయంలో ప్రతిరోజూ భజన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు శ్రావణ మాసం చివరి సోమవారం. శ్రావణ మాసం ప్రారంభం అయిన రోజు నుండి ప్రతి రోజూ రాత్రి 9 గంటల నుండి అర్ధరాత్రి 12 గంటల వరకు శ్రీ రామాలయం సోనాల లో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా నిత్య భజనలు నిర్వహిస్తున్న సితా రామ భజన మండలి సభ్యులు భక్తులు గ్రామస్తులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని భజన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు



# ప్రభుత్వ పాఠశాలలకు చేయూత

**జనగామ సెప్టెంబర్ 7( డిడి-9వార్త) బ్యూరో**



ఇబ్రహీంపూర్ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి యువత, దాతలు ముందుకు రావడం అభినందనీయమని జనగామ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ చందర్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపూర్ హై స్కూల్ విద్యార్థులకు చింత మహేష్, పయ్యావుల రఘుపతి సొంత ఖర్చులతో నోట్ బుక్‌లు అందించారు. వాటిని జగదీష్ చందర్ రెడ్డి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పోకల శ్రీనివాస్, ఉపసర్పంచ్ చింత నరేష్, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు మేడిపల్లి నరేష్,విరోజీ ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పిట్టల సురేష్

**జనగామ సెప్టెంబర్ 7(డిడి 9వార్త)బ్యూరో**



తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా పిట్టల సురేష్ నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేతుల మీదుగా సురేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకత్వం మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించింది. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థుల విద్యా, సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతూ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆకాంక్షించింది.

తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్నకు పిట్టల సురేష్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

## దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాత మధుపై కఠిన చర్యలు తీసుకోవాలి

- **యూత్ కాంగ్రెస్ గుండాల మండల అధ్యక్షులు దార అశోక్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు గుర్రం పుష్పరాజ్**

**గుండాల, సెప్టెంబర్ 7 డిడి 9వార్త:**



అసెంబ్లీ ఆవరణలో దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి ఎమ్మెల్సీ తాత మధు అనుచితంగా, తీవ్రమైన పదజాలంతో వ్యాఖ్యలు చేయడం అత్యంత అభ్యంతరకరమని యూత్ కాంగ్రెస్ గుండాల మండల అధ్యక్షులు దార అశోక్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ గుండాల మండల అధ్యక్షులు గుర్రం పుష్పరాజ్ అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన సభలో స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సభ గౌరవాన్ని, దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా ఉందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు ఉండటం సహజమని, ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేయడం ప్రతి రాజకీయ పార్టీకి ఉన్న హక్కు అని వారు పేర్కొన్నారు. అయితే రాజకీయ విమర్శల పేరుతో వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసేలా, ఒక సామాజిక వర్గం మనోభావాలను కించపరిచేలా అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్సీ మరింత సంయమనంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యత కల్పిస్తోందని వారు తెలిపారు. తెలంగాణ మంత్రివర్గంలో దళితులకు మంత్రులుగా అవకాశం కల్పించడంతో పాటు, దళిత వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్‌కు రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా అత్యున్నత బాధ్యతను అప్పగించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల పట్ల తన నిబద్ధతను చాటుకుందని అన్నారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించాల్సిన బాధ్యత ప్రతిపక్షాలపై కూడా ఉందని, అయితే ప్రజా సమస్యలపై సమాధానం చెప్పకుండా అసలు అంశాలను పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని వారు విమర్శించారు. తమ నాయకుడు అసెంబ్లీకి రాకపోవడంపై సమాధానం చెప్పలేక ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. స్పీకర్ పదవి అనేది ఒక పార్టీకి సంబంధించిన పదవి కాదని, అది మొత్తం శాసనసభకు సంబంధించిన రాజ్యాంగబద్ధమైన పదవి అని వారు పేర్కొన్నారు. అందువల్ల స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడే ప్రతి ఒక్కరూ ఆ పదవి గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. అదే సమయంలో దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ఏ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు చేసినా ఖండించాల్సిందేనని స్పష్టం చేశారు. తాత మధు చేసిన వ్యాఖ్యలపై సంబంధిత పార్టీ నాయకత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని దార అశోక్, గుర్రం పుష్పరాజ్ డిమాండ్ చేశారు. దళిత సమాజం ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను తెలంగాణ ప్రజలు ముక్తకంఠంతో ఖండించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కీసరి సాగర్, జనగం సాంబయ్య, కీసర కృష్ణ, కీసర చందరావు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బొమ్మర్ల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు కొండ్రు నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## 6 గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయాలి

- **ప్రజావాణిలో ఎంపీడీవోకు బీఆర్ఎస్ నాయకుల మెమోరాండం**

**గుండాల, సెప్టెంబర్ 7 డిడీ 9వార్త:**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎంపీడీవోకు మెమోరాండం సమర్పించారు. బీఆర్ఎస్ పార్టీ మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు మోకాళ్ల వీరస్వామి, పార్టీ నాయకులు గడ్డం వీరన్న ఆధ్వర్యంలో నాయకులు ప్రజావాణిలో దరఖాస్తు అందజేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎన్నికల హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించినప్పటికీ, ఇప్పటికీ అనేక హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని వారు పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరి కాదని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి టి. రాము, యువజన విభాగం అధ్యక్షులు సయ్యద్ అజ్జు, ఎస్సీ సెల్ అధ్యక్షులు నిట్ట రాములు, పార్టీ నాయకులు జాడి ప్రభాకర్, లింగగూడెం ఉపసర్పంచ్ శోభన్ బాబు, తనసరి భాస్కర్, గంగాధరి నాగన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఆశ్రమ పాఠశాలల సమస్యలపై ఐటీడీఏ నిర్లక్ష్యమెందుకు..?!

- **బీరెల్లి–రంగాపురం ఆశ్రమ పాఠశాల పరిస్థితి దయనీయం**
- **భూర్కపేటలో దోమల బెడద.. వర్షపు నీటితో వరండాలు**
- **ఆశ్రమ పాఠశాలల సమస్యలపై ఐటీడీఏ నిర్లక్ష్యమెందుకు..?!**
- **బీరెల్లి–రంగాపురం ఆశ్రమ పాఠశాల పరిస్థితి దయనీయం**
- **భూర్కపేటలో దోమల బెడద.. వర్షపు నీటితో వరండాలు**
- **కొడిశెల, కాల్వపెల్లి, చిన్నబోయినపెల్లి పాఠశాలల్లోనూ సమస్యలే**
- **అధికారుల పర్యటనలు కాగితాలకే పరిమితమా..?**

**.ఏటూరు నాగారం క్రైం:**





గిరిజన విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఆశ్రమ పాఠశాలలు సమస్యలతో సతమతమవుతున్నాయని గిరిజన సంఘాలు,విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు,పారిశుధ్యం, మరుగుదొడ్లు,ప్రహరీగోడలు,వర్షపు నీటి సమస్యలు వంటి అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంబంధిత ఐటీడీఏ అధికారులు తగిన స్థాయిలో స్పందించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ములుగు జిల్లా పరిధిలోని పలు ఆశ్రమ పాఠశాలలను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ,గిరిజన సంఘాల ప్రతినిధులు సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఇబ్బందులను వారి దృష్టికి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.

**వర్షం వస్తే వరండాలోనే నీరు.. దోమల బెడద...**

భూర్కపేట ఆశ్రమ పాఠశాలలో వర్షపు నీరు వరండాలోకి చేరుతున్న పరిస్థితి ఉందని,దోమల బెడద కూడా తీవ్రంగా ఉందని విద్యార్థులు,సందర్శించిన ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. దోమల కారణంగా సీజనల్ జ్వరాల బారిన పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. మరుగుదొడ్లు సక్రమంగా పనిచేయకపోవడం,వర్షపు నీరు పాఠశాల ప్రాంగణంలోకి చేరడం వంటి సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని వారు ఆరోపిస్తున్నారు.విద్యార్థుల ఇబ్బందులను పట్టించుకోకపోతే తాము ఇక్కడ ఎందుకు ఉండాలని, ఇళ్లకు వెళ్లిపోవడమే మంచిదని కొందరు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేసినట్లు సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు.విద్యార్థులు ఇలాంటి స్థితికి చేరుకోవడం అత్యంత బాధాకరమని,సంబంధిత పీఓ స్థాయి అధికారులు తక్షణమే స్పందించాలని వారు కోరుతున్నారు.

**అధికారుల నిర్లక్ష్యపు నీడలో ఆశ్రమ పాఠశాలలు..!**

ఆశ్రమ పాఠశాలలను అధికారులు క్షేత్రస్థాయిలో తరచూ పరిశీలించి సమస్యలను పరిష్కరించాల్సి ఉండగా,కార్యాలయాలకే పరిమితం అవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.తాడ్వాయి మండలంలోని బీరెల్లి-రంగాపురం ఆశ్రమ పాఠశాలలో గతంలో సుమారు 100 మంది విద్యార్థులు ఉండగా, ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందని స్థానికులు చెబుతున్నారు. మరుగుదొడ్లు మరమ్మతులకు రావడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. పాఠశాలలో హెచ్‌ఎం,ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ విద్యార్థుల సమస్యలను పర్యవేక్షించే వ్యవస్థ మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు అంటున్నారు.హెచ్‌ఎం స్థానికంగా ఉండకుండా నర్సంపేట నుంచి రాకపోకలు సాగిస్తున్నారని,రాత్రివేళ విద్యార్థుల వద్ద బాధ్యతాయుతమైన పర్యవేక్షణ లేకపోతే అత్యవసర పరిస్థితుల్లో ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్నలను వారు లేవనెత్తుతున్నారు.

**మరో మూడు ఆశ్రమ పాఠశాలల్లోనూ సమస్యలే..!**

కొడిశెల,కాల్వపెల్లి,చిన్నబోయినపెల్లి ఆశ్రమ పాఠశాలల్లోనూ పలు సమస్యలు ఉన్నాయని గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి.కొడిశెల ఆశ్రమ పాఠశాలకు మరుగుదొడ్డి మాత్రమే మంజూరు చేసి పనులు కొనసాగుతున్నప్పటికీ,మిగతా సమస్యలపై తగిన దృష్టి లేదని వారు అంటున్నారు.పలు పాఠశాలలకు ప్రహరీగోడలు అవసరమని, మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టాల్సి ఉందని చెబుతున్నారు. పాఠశాలల గ్రౌండ్‌లో సరైన మట్టి వేయకపోవడంతో వర్షాకాలంలో బురదగా మారి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపిస్తున్నారు.విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యకు సంబంధించిన సమస్యలను ఇకనైనా ప్రాధాన్యతతో పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**ఆఫీసులకే పరిమితమా.. క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఎక్కడ..?**

ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రధానంగా గిరిజన కుటుంబాలకు చెందిన వారే. వారి విద్య, వసతి,ఆరోగ్యం,భద్రత విషయంలో అధికారులు మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.పాఠశాలల్లో సమస్యలు ఉన్నాయని విద్యార్థులు, స్థానికులు,సంఘాల ప్రతినిధులు చెబుతున్న నేపథ్యంలో సంబంధిత ఐటీడీఏ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు

**.ఫైళ్లలో హామీలు.. పాఠశాలల్లో సమస్యలు — ఇదేనా గిరిజన విద్యార్థుల పట్ల శ్రద్ధ..?**

ఆశ్రమ పాఠశాలలు సమస్యలతో కొట్టుమిట్టాడుతుంటే అధికారులు కార్యాలయాలకే పరిమితం కావడం ఎంతవరకు సమంజసం...? అనే ప్రశ్నలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. విద్యార్థుల సమస్యలను తక్షణమే గుర్తించి, మరుగుదొడ్లు,పారిశుధ్యం, దోమల నివారణ,వర్షపు నీటి సమస్య, ప్రహరీగోడలు,గ్రౌండ్ అభివృద్ధి తదితర పనులను అత్యవసర ప్రాతిపదికన చేపట్టాలని గిరిజన సంఘాలు,ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నాయి.





## హామీలు ఎక్కడ..? అమలు ఎక్కడ..?

- **420 హామీలు.. 13 డిక్లరేషన్లు.. 6 గ్యారంటీలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ సూటి ప్రశ్న..**
- **హామీల అమలుకు తక్షణ చర్యలు తీసుకోవాలి.. లేదంటే ప్రజా ఉద్యమం ఉధృతం..**

**సెప్టెంబర్ 07, డీడీ9 వార్త, వెంకటాపురం:**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ యూత్ నాయకులు వెంకటాపురం మండల కేంద్రంలో ప్రభుత్వ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీల పేరుతో ప్రజల నుంచి ఓట్లు పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు వాటి అమలుపై ఎందుకు మౌనం వహిస్తోందని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు.

అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల హామీల్లో అనేకం ఇంకా అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. హామీలు ఇచ్చినప్పుడు ప్రజల ముందుకు వచ్చిన ప్రభుత్వం.. అమలు చేయాల్సిన సమయం వచ్చేసరికి ఎందుకు వెనుకడుగు వేస్తోందని నిలదీశారు. మాటలు కాదు.. చేతల్లో హామీలను చూపించాలని డిమాండ్ చేశారు.

మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, తులం బంగారం, స్కూటీల పంపిణీ, రైతులకు



### స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుసూదన్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- **మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కర్నాటి రామకోటేశ్వరరావు....**

**బోనకల్,సెప్టెంబర్ 07,(డీడీ 9 వార్త):**



శాసనసభ స్పీకర్ శ్రీ గడ్డం ప్రసాద్‌పై శాసన మండలి సభ్యుడు తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కర్నాటి రామకోటేశ్వరరావు తెలిపారు,మంగళవారం అసెంబ్లీ సమావేశం సందర్భంగా వారు నిర్వహించిన కార్యక్రమం కేవలం కావాలనే దురుద్దేశంతో చేశారని మండిపడ్డారు.

రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై ఈ తరహా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ విలువలను అవమానించడమేనని ప్రజాస్వామ్యానికి ప్రతీకగా ఉన్న స్పీకర్ పదవిని ప్రతి ప్రజాప్రతినిధి గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు.

బాధ్యతాయుతమైన శాసనమండలి సభ్యుడిగా ఉన్న తాతా మధుసూదన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సమాజం హర్షించదనీ బీఆర్ఎస్ పార్టీ అనుచిత భాషకు తాతా మధుసూదన్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని ప్రజలు భావించే పరిస్థితి ఏర్పడిందనీ కోటి అన్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన రాజకీయ శిక్షణ ఇదేనా? ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి ప్రజా ప్రతినిధికి ఉందన్నారు. తాతా మధుసూదన్ చేసిన వ్యాఖ్యలు దళిత సమాజాన్ని తీవ్రంగా బాధించాయి. ఇలాంటి వ్యాఖ్యలను ఉపేక్షిస్తే భవిష్యత్తులో రాజ్యాంగబద్ధ పదవుల గౌరవం మరింత దెబ్బతినే ప్రమాదం ఉంది. అందువల్ల తాతా మధుసూదన్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామని రామకోటేశ్వరరావు అన్నారు.

## ఉప ముఖ్యమంత్రి చొరవతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**బోనకల్,సెప్టెంబర్ 07, (డీడీ 9 వార్త):**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సహకారంతో సుమారు లక్ష 20 వేల రూపాయలు విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆళ్లపాడు గ్రామానికి చెందిన బండి వెంకటేశ్వర్లు, మరీదు భవాని,మరీదు బసవమ్మ,బెజవాడ రవిలు వివిధ ప్రవేట్ ఆసుపత్రిలో అనారోగ్యంతో వైద్య చికిత్సలు చేయించుకొని సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోవడంతో రాజకీయాల కతీతంగా కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి అందించాలనే ఉద్ధేశంతో వారికి మంజూరైన చెక్కలను లబ్ధిదారులకు అందజేశమని పేర్కొన్నారు, వివిధ కారణాల చేత వైద్య పరీక్షలు నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకునే వారూ స్థానిక కాంగ్రెస్ నాయకులను సంప్రదించాలని గ్రామస్తులకు తెలిపారు,ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ కందుల పాపారావు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారా వెంకట మోహన్ రావు,మండల కమిటీ సభ్యుడు బుంగ రాములు, కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు మరీదు వీరబాబు, సొసైటీ డైరెక్టర్ తోటకూర వెంకటేశ్వరరావు, వార్డు మెంబర్లు మరీదు రామారావు,మొండితోక రోశయ్య మరీదు బరకయ్య,మల్లాది లింగయ్య,షేక్ నాగుల్ మీరా,మందా కృష్ణ,మరీదు నాగభూషణం,మరీదు రాంబాబు,మరీదు రోశయ్య,మొండితోక గోపి,గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- **ఆరు గ్యారంటీలు.. 420 హామీలు ఏమయ్యాయి?**
- **హామీలు నెరవేర్చే వరకు పోరాటం కొనసాగిస్తాం**
- **బీఆర్ఎస్ మండల నాయకుడు ఆకోజు సునీల్‌కుమార్**



**భద్రాచలం టౌన్, సెప్టెంబరు 7 (డీడీ9 వార్త):** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవోకు వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకుడు ఆకోజు సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు జరిగిన అన్యాయాలను ఎండగడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. హామీలను అమలు చేసే వరకు ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే ఇచ్చిన హామీలను అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు కోటగిరి ప్రమోద్‌కుమార్, తుమ్మలపల్లి ధనేశ్వరరావు, రేపాక పూర్ణచంద్రరావు, కొండముక్కల సాయిబాబా, బద్ది బాబి, అయినాల రామకృష్ణ, తాండ్ర ప్రసాద్, పంజా సునీల్‌కాంత్, గోసుల వెంకట శ్రీనివాస్, రావూరి రవికిరణ్, కొల్లిపాక శివ, రోహిత్ పాషా, అందుర్తి వెంకటరావు, బత్తుల నరసింహులు, దానియేలు ప్రదీప్, రుద్రరామరాజు, చిట్టిమళ్ల అనిల్, బాసిపోయిన మోహన్‌రావు, మహిళా నాయకులు కనితి రాధా, ఏనిక శిరీష, ప్రియాం

## ఆంజనేయస్వామి ఆలయానికి జీర్ణోద్ధరణ

- **సంప్రదాయబద్ధంగా అంకురార్పణ..**
- **రంగనాయకుల గుట్టకు ఉత్సవమూర్తుల తరలింపు**

**భద్రాచలం టౌన్ (డీడీ 9 వార్త), సెప్టెంబరు 7:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన ఆంజనేయస్వామి ఆలయానికి జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ పునరుద్ధరణకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, సోమవారం సంప్రదాయబద్ధంగా జీర్ణోద్ధరణ, కళావాహన కార్యక్రమాలను నిర్వహించారు.
జీర్ణోద్ధరణ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు, వైదిక కార్యక్రమాలను నిర్వహించి ఆలయ పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. జీర్ణోద్ధరణ నేపథ్యంలో ఆంజనేయస్వామి ఆలయంలోని విగ్రహాలను తాత్కాలికంగా రంగనాయకుల గుట్టపైకి తరలించారు.
ఇప్పటికే శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలోని పలు పరివార ఆలయాల్లో జీర్ణోద్ధరణ, కళావాహన కార్యక్రమాలు చేపట్టి పునరుద్ధరణ పనులు కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయం, గోదాదేవి అమ్మవారి ఆలయాలతో పాటు ఇతర పరివార ఆలయాల్లోనూ అవసరమైన మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలోని పురాతన కట్టడాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూనే, ఆలయాల వైభవాన్ని కాపాడటం, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా జీర్ణోద్ధరణ పనులు కొనసాగుతున్నాయి.



## గిరిజన దర్బార్ వినతులకు సత్వర పరిష్కారం

- **ఐటీడీఏ పీవో బి.రాహుల్**

**భద్రాచలం టౌన్ , సెప్టెంబర్ 7: ( డిడి9 వార్త)** గిరిజన దర్బార్ లో గిరిజనులు సమర్పించే ప్రతి వినతిని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో వివిధ ఆదివాసీ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల వినతులు, సమస్యలను ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, ఎస్ డీసీ ట్రైబల్ వెల్ఫేర్ ఆనంద్ కుమార్ , గురుకులం ఆర్ సీవో అరుణకుమారి తదితర అధికారులతో కలిసి పీవో స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో రాల్ మాట్లాడుతూ గిరిజనులు సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, పెన్షన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర సమస్యలను పీవో దృష్టికి తీసుకువచ్చారు. గిరిజనుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు గిరిజన దర్బార్ ముఖ్యమైన వేదిక అన్నారు. ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, సంబంధిత శాఖలకు వెంటనే పంపించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావులేకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, క్లిష్టమైన సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని తెలిపారు. ప్రతి వినతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి పరిష్కార స్థితిని పరిశీలించాలన్నారు. ప్రజలు తమ దరఖాస్తులతో పాటు అవసరమైన ఆధార పత్రాలను సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత వేగంగా జరుగుతుందని పీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్ , ఏపీవో పవర్ వేణు, ఏవో సున్నం రాంబాబు, పీవీటీజీ అధికారి గన్యా, ఎల్ టీఆర్ డీటీ మణిధర్ , ఐసీడీఎస్ సూపర్ వైజర్ అనసూయ, మిషన్ భగీరథ వర్క్ ఇన్ స్పెక్టర్ వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## PHC వైద్య బృందం నేతృత్వంలో గురుకులాల్లో హెల్త్ క్యాంపు.

- **సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచన..**

**మణుగూరు. సెప్టెంబర్ 7(డి డి 9వార్త)** భద్రాద్రి జిల్లా, మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం ఆధ్వర్యంలో సోమవారం నాడు మణుగూరు పట్టణంలోని రాజీవ్ గాంధీ నగర్ లోగల బాలుర ఆశ్రమ పాఠశాలలో, మరియు లంక మల్లారం గ్రామంలోని బాలికల గురుకుల పాఠశాల లో హెల్త్ క్యాంపులు నిర్వహించారు.జ్వరాలతో బాధపడుతున్న పిల్లల నుంచి రక్త నమూనాలను సేకరించారు. పలు రకాల రుగ్మతలకు మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ,పరిసరాల పరిశుభ్రత తోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తడి దుస్తులు వేసుకోవద్దని డాక్టర్ ఉమాదేవి సూచించారు.పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో Phn సత్తెమ్మ, హెల్త్ అసిస్టెంట్ రాంప్రసాద్,కృష్ణ, సుమ, మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆదివాసిహక్కులపోరాటసమితితుడుందెబ్బశాంతియుతర్యాలీలో పాల్గొన్నతుడుందెబ్బరాష్ట్రఅధ్యక్షులుడాక్టర్మైపతిఅరుణ్‌కుమార్

- **ఆదివాసులతో దద్దరిల్లిన ఏటూర్‌నాగారం ఐటీడీఏ**
- **తుడుందెబ్బ ఆధ్వర్యంలో**
- **ఏటూర్‌నాగారం ఐటీడీఏ మార్చ్–ముట్టడి**
- **భారీ నిరసన కార్యక్రమం విజయవంతం**
- **వేలాదిగా తరలివచ్చిన ఆదివాసులు**

**ఏటూర్‌నాగారంతాడ్వాయి DD9 వార్త** ఆదివాసుల హక్కులు, అస్తిత్వ పరిరక్షణ కోసం తుడుందెబ్బ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఏటూర్‌నాగారం ఐటీడీఏ మార్చ్-ముట్టడి కార్యక్రమం భారీగా విజయవంతమైంది. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసులు, యువతీ యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఆదివాసుల హక్కులను పరిరక్షించాలని, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో 5వ షెడ్యూల్, పీసా చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నాయకులు నినాదాలు చేశారు. ఆదివాసీ యువతకు ఉద్యోగాలు, విద్యా అవకాశాలు కల్పించడంతో పాటు ఆదివాసీ ప్రాంతాల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు.వేలాది మంది ఆదివాసులు ఏటూర్‌నాగారం ఐటీడీఏకు తరలిరావడంతో ప్రాంత మంతా ఆదివాసీ నినాదాలతో దద్దరిల్లింది. శాంతియుతంగా నిర్వహించిన ఈ మార్చ్-ముట్టడి కార్యక్రమం విజయవంతం కావడంతో తుడుందెబ్బ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.ఆదివాసుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా, తక్షణమే చర్చలు జరిపి న్యాయం చేయాలని తుడుందెబ్బ నాయకులు డిమాండ్ చేశారు.







## రాజుపేటలో మురుగునీటి కష్టాలు

- **రూ.10 లక్షల సైడ్ డ్రెయిన్ పనులకు బ్రేక్**
- **మూడు నెలలుగా రోడ్డుపైనే మురుగు.. ప్రజల అవస్థలు**
- **అధికారుల నిర్లక్ష్యంపై వార్డు సభ్యురాలి ఆరోపణలు**

**భద్రాచలం టౌన్, సెప్టెంబరు 7 (డిడి9 వార్త):** భద్రాచలం పట్టణంలోని రాజుపేట కాలనీలో మురుగునీటి సమస్య తీవ్రరూపం దాల్చినా అధికారులు పట్టించుకోవడం లేదని 20వ వార్డు సభ్యురాలు ఇర్పా అనసూయ ఆరోపించారు. పంచాయతీ నిధులు సుమారు రూ.10 లక్షలతో చేపట్టిన సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులు 75 శాతం పూర్తయిన అనంతరం నిలిచిపోయాయని ఆమె తెలిపారు.
దీంతో వర్షపు నీరు, మురుగునీరు రోడ్డుపైకి చేరి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గత మూడు నెలలుగా రహదారిపై నీరు నిలిచి బురదమయంగా మారడంతో చిన్నారులు, వృద్ధులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీరు నిల్వ ఉండటంతో దోమల బెడద కూడా పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి నెలకొందన్నారు.
పాలకమండలి తీర్మానం చేసిన అభివృద్ధి పనులను వ్యక్తిగత ప్రయోజనాల కోసం అడ్డుకోవడం సరికాదని అనసూయ పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి ఇప్పటికే పలుమార్లు పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌ను కలిసి వినతిపత్రాలు అందించినప్పటికీ పనులు ముందుకు సాగడం లేదని ఆరోపించారు.
అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుపై నిలిచిన మురుగునీటిని తొలగించడంతో పాటు, నిలిచిపోయిన సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులను పూర్తిచేసి కాలనీవాసుల సమస్యను పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు.



## తల్లిదండ్రులు లేకున్నా.. వైద్య విద్యకు ఐటీడీఏ పీఓ బి రాహుల్ చేయూత

- **ఆదివాసీ విద్యార్థి ఎంబీబీఎస్‌కు ఐటీడీఏ ఆర్థిక చేయూత**
- **రిలీఫ్ ఫండ్ నుంచి సంతోష్‌కు రూ.60 వేలు.. భూక్యవాసినికి రూ.50 వేలు**

**భద్రాచలం టౌన్, సెప్టెంబరు 7 డిడి 9 వార్త** తల్లిదండ్రులు లేకపోయినా పట్టుదలతో చదివి నీట్‌లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీట్లు సాధించిన ఆదివాసీ విద్యార్థులకు ఐటీడీఏ అండగా నిలిచింది. ఐటీడీఏ రిలీఫ్ ఫండ్ నుంచి ఇద్దరు విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించింది.
ములకలపల్లి మండలం సీతాయిగూడెం గ్రామానికి చెందిన కోయ ఆదివాసీ విద్యార్థి నక్క సంతోష్ తల్లిదండ్రులు లేకపోయినా కష్టపడి చదివి నీట్‌లో 424 మార్కులు సాధించి ఎంబీబీఎస్ సీటు పొందాడు. అదేవిధంగా కోదాడ మండలం కొత్తగూడెం తండాకు చెందిన భూక్యవాసిని నీట్‌లో 474 మార్కులు సాధించి ఎంబీబీఎస్‌లో సీటు సంపాదించింది.
సోమవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ తన ఛాంబర్‌లో సంతోష్‌కు రూ.60 వేల చెక్కును, భూక్యవాసినికి రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల వైద్య విద్యకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ఐటీడీఏ తరపున సహాయం అందించినట్లు తెలిపారు.
నక్క సంతోష్ ఎంబీబీఎస్ చదువుకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని పత్రికల్లో వచ్చిన కథనాల ద్వారా తెలుసుకున్న వెంటనే స్పందించినట్లు రాహుల్ తెలిపారు. ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు కూడా ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే రిలీఫ్ ఫండ్ నుంచి రూ.60 వేల ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు చెప్పారు. అదేవిధంగా పేదరికాన్ని అధిగమించి పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించిన భూక్యవాసినికి కూడా కోర్సు కొనసాగించేందుకు రూ.50 వేల సహాయం అందించినట్లు పేర్కొన్నారు. గిరిజన వర్గాలకు చెందిన విద్యార్థులు వైద్యులుగా ఎదగాలనే లక్ష్యంతో కష్టపడి చదివి సీట్లు సాధించడం అభినందనీయమన్నారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు అవసరమైన సహకారం అందించేందుకు ఐటీడీఏ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.
సంతోష్ వైద్య విద్యకు ఆర్థిక సహాయం చేయాలని ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు పీవోను కోరగా, ఆయన వెంటనే స్పందించి గంట వ్యవధిలోనే రూ.60 వేల చెక్కును అందించడం పట్ల ఆదివాసీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పేద ఆదివాసీ విద్యార్థి వైద్య విద్యకు చేయూతనందించిన పీవో రాహుల్‌కు వారు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో భద్రాచలం కోయ కుల సంఘం పటేల్ తెల్లం రమణయ్య, ఆదివాసీ నాయకులు కుంజా ధర్మా, కుంజా సంతోష్, పూనెం వీరభద్రం, గుండు శరత్, పాయం రవివర్మ, ముర్ల రమేష్, పూనెం నాగేశ్వరరావు, కొండ్రు వీరస్వామి, కొండ్రు సుధారాణి, కణితి రాధ, మిడియం నాగమణి తదితరులు పాల్గొన్నారు.



## మూగజీవాల వేధింపులపై బీజేపీ ఆగ్రహం.. డీఎస్పీకి వినతి

**భద్రాచలం టౌన్, సెప్టెంబర్ 7 (డిడి9 వార్త)** భద్రాచలం పరిసర ప్రాంతాల్లో ఎద్దులు, ఆవులతో ఇసుక బండ్లు లాగిస్తూ మూగజీవాలపై జరుగుతున్న అక్రమాలు, దాడులను తక్షణమే అరికట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్‌ను కలిసి వారు వినతిపత్రం అందజేశారు.
గోదావరి ఇసుక ర్యాంపుల నుంచి భద్రాచలం వైపు ఎద్దుల బండ్లతో ఇసుక తరలించే క్రమంలో పశువులతో అధిక బరువులు మోయిస్తున్నారని, విశ్రాంతి లేకుండా నిరంతరం తిప్పుతూ దయగలిగిన సంప్రదాయానికి తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలసిపోయిన పశువులను కర్రలతో కొడుతూ తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారంటూ ఈ సందర్భంగా డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.
శ్రీ సీతారామచంద్రస్వామివారి పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో గోమాతను పూజించే సంస్కృతికి విరుద్ధంగా మూగజీవాలపై జరుగుతున్న ఈ క్రూరత్వాన్ని ఉపేక్షించరాదని కోరారు. తక్షణమే విచారణ చేపట్టి, పశువులను హింసిస్తున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రంలో స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్, నాయకులు కుంజా ధర్మా, నిడదవోలు నాగబాబు, ముత్యాల చంద్రశేఖర్, గంగులకుర్తి రామాచారి తదితరులు పాల్గొన్నారు.




# ప్రజా పోరాటాలే టీ.వీ.ఆర్. చంద్రంకు ఘన నివాళి

- **ప్రజా పోరాటాలే టీ.వీ.ఆర్. చంద్రంకు ఘన నివాళి**
- **సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్**

**భద్రాచలం టౌన్ , సెప్టెంబరు 7 ( డిడి9 వార్త )** దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి ప్రజా పోరాటాలు నిర్వహించడమే కామ్రేడ్ టీ.వీ.ఆర్. చంద్రంకు మనమిచ్చే ఘన నివాళి అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే రమేష్ అన్నారు. టీ.వీ.ఆర్ చంద్రం 20వ వర్ధంతి సభను పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఏజే రమేష్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించగా, నాయకులు చంద్రం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు చంద్రం పోరాడారని, భద్రాచలం నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ తొలి శాఖ కార్యదర్శిగా, డివిజన్ ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. వ్యవసాయ కార్మికులను సమీకరించి వారి సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ప్రస్తుతం కార్పొరేట్ శక్తుల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపీఎం నాయకులు, కార్యకర్తలు, చంద్రం కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.



# ఆ ముగ్గురిని తప్ప అందరినీ మార్చేయండి.. పాక్ జట్టుపై షోయబ్ అక్తర్ ఘాటు వ్యాఖ్యలు

- ఇంగ్లండ్‌తో సిరీస్ మధ్యలో జట్టు మార్పులకు షోయబ్ అక్తర్ పూర్తి మద్దతు
- ఇది గందరగోళం కాదని, భవిష్యత్ జట్టు నిర్మాణం కోసమేనని వ్యాఖ్య
- షాహీన్, నసీమ్, రవూఫ్‌లను మాత్రమే కాపాడాలని సూచన
- కెప్టెన్ బాబర్ అజామ్‌ను దీర్ఘకాలిక ప్రణాళికల నుంచి తప్పించాలని పరోక్ష సూచన
- పాక్ క్రికెట్ ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉందని సంచలన వ్యాఖ్య

**డీడీ9 వార్త :**

పాకిస్థాన్ క్రికెట్ జట్టులో జరుగుతున్న భారీ మార్పులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో, ఆ దేశ మాజీ ఫాస్ట్ బౌలర్, రావల్పిండి ఎక్స్‌ప్రెస్ షోయబ్ అక్తర్ మద్దతుగా నిలిచాడు. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్ మధ్యలో ఏకంగా ఏడుగురు కొత్త ఆటగాళ్లను జట్టులోకి తీసుకోవడం గందరగోళం కాదని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చేస్తున్న ప్రణాళికాబద్ధమైన ప్రక్షాళన అని అభిప్రాయపడ్డాడు. ఈ క్రమంలో కెప్టెన్ బాబర్ అజామ్‌ను కూడా దీర్ఘకాలిక ప్రణాళికల నుంచి తప్పించాలని పరోక్షంగా సూచించాడు.

ఇంగ్లండ్‌తో మూడో టెస్టుకు ముందు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) జట్టులో భారీ మార్పులు చేయడంపై క్రీడా వర్గాల నుంచి విమర్శలు వచ్చాయి. పీసీబీకి స్థిరమైన విధానం లేదని పలువురు మండిపడ్డారు. ఈ నేపథ్యంలో 'అవుట్ సైడ్ ఎడ్జ్ షో'లో మాట్లాడిన అక్తర్, పీసీబీ చర్యలను సమర్థించాడు. "ప్రస్తుత జట్టుపై పీసీబీ తీవ్ర నిరాశతో ఉంది. అందుకే ఈ మార్పులు చూసి నేను ఆశ్చర్యపోలేదు. ఇది సరైన చర్య. కేవలం పాకిస్థాన్ కోసం ఆడాలనే తపన ఉన్న యువ ఆటగాళ్లతో కొత్త జట్టును నిర్మించాలని బోర్డు చూస్తోంది" అని వివరించాడు.

ఈ ప్రక్షాళనలో కేవలం ముగ్గురు ఆటగాళ్లను మాత్రమే కాపాడాలని అక్తర్ స్పష్టం చేశాడు. ఫాస్ట్ బౌలర్లు షహీన్ అఫ్రిది, నసీమ్ షా, హారిస్ రవూఫ్‌లను మాత్రమే దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా కొనసాగించాలని సూచించాడు. అయితే, ప్రస్తుత కెప్టెన్ బాబర్ అజామ్ పేరును అక్తర్ ప్రస్తావించకపోవడం గమనార్హం.

రెండో టెస్ట్ ఓటమి తర్వాత తాను ఒక పీసీబీ అధికారితో మాట్లాడినట్లు అక్తర్ వెల్లడించాడు. కొత్తగా వస్తున్న ఆటగాళ్ల నుంచి ఏం ఆశిస్తున్నారని అడగ్గా, "వాళ్ల నుంచి ఏమీ ఆశించడం లేదు. మేం భవిష్యత్ తరం ఆటగాళ్లపై దృష్టి పెట్టాం. పాకిస్థాన్ క్రికెట్ ప్రస్తుతం వెంటిలేటర్‌పై ఉంది. ఈ పునర్నిర్మాణ ప్రక్రియకు కనీసం రెండేళ్లు పడుతుంది" అని ఆ అధికారి చెప్పినట్లు అక్తర్ పేర్కొన్నాడు. ఇంగ్లండ్‌తో వరుస ఓటములపై స్పందిస్తూ, "మా జట్టులో పోరాట స్ఫూర్తి కొరవడింది" అని అక్తర్ వ్యాఖ్యానించాడు.



# మెస్సీ కుమారుడు దుమ్మురేపాడు.. 11 ఏళ్లకే ట్రోఫీ సాధించాడు!

- నేపుల్స్ కప్ గెలిచిన మెస్సీ కొడుకు మతేయో
- ఇంటర్ మియామీ అకాడమీకి కెప్టెన్‌గా మతేయో
- సెప్టెంబర్ 11న మతేయోకు 11 ఏళ్లు
- నేపుల్స్ కప్ ట్రోఫీతో మతేయో ఫొటోలు వైరల్
- మెస్సీకి ముగ్గురు కుమారులు

**డీడీ9 వార్త :**

ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ కొడుకు మతేయో మరోసారి వార్తల్లో నిలిచాడు. ఇంటర్ మియామీ అకాడమీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన అతడు నేపుల్స్ కప్ టైటిల్‌ను అందించాడు. త్వరలో 11వ పుట్టినరోజు జరుపుకోబోతున్న మతేయో.. చిన్న వయసులోనే తన ఆటతీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు.

నేపుల్స్ కప్ ఫైనల్‌లో ఇంటర్ మియామీ అకాడమీ విజయం సాధించింది. టైటిల్ గెలిచిన తర్వాత మతేయో ట్రోఫీతో ఫొటోలకు పోజిచ్చాడు. 'ఛాంపియన్' అని రాసి ఉన్న కప్‌ను చేతిలో పట్టుకుని చిరునవ్వులు చిందించాడు. స్పానిష్ పత్రిక 'మార్కా' ఈ వీడియోను సోషల్ మీడియాలో పంచుకుంది.

మెస్సీకి ముగ్గురు కుమారులు. మతేయో రెండో కుమారుడు. సెప్టెంబర్ 11న అతడు 11వ పుట్టినరోజు జరుపుకోనున్నాడు. పెద్ద కుమారుడు థియాగో వయసు 13 ఏళ్లు. చిన్న కుమారుడు సిరోకు 8 ఏళ్లు.

మతేయో విజయంపై మెస్సీ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తున్నారు. తండ్రి బాటలోనే ఫుట్‌బాల్‌లో ముందుకు సాగుతున్నాడంటూ కామెంట్లు చేస్తున్నారు.

ఇదిలా ఉంటే.. అర్జెంటీనా జాతీయ జట్టుతో తన 21 ఏళ్ల ప్రస్థానానికి మెస్సీ ఇటీవల ముగింపు పలికిన విషయం తెలిసిందే. 2026 ప్రపంచకప్ ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓడిన రెండు రోజుల తర్వాత జులై 21న తన రిటైర్మెంట్ సందేశాన్ని రాసినట్లు మెస్సీ వెల్లడించాడు. 2022లో అర్జెంటీనాకు ప్రపంచకప్ అందించిన మెస్సీ.. జాతీయ జట్టుతో ఇకపై మైదానంలో కనిపించబోనని స్పష్టం చేశాడు.



# ఇషాన్ కిషన్ విశ్వరూపం.. ఈస్ట్ జోన్ 708 పరుగుల భారీ స్కోరు

- దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ పరుగుల వరద
- కెప్టెన్ ఇషాన్ కిషన్ 270 పరుగులతో అద్భుత డబుల్ సెంచరీ
- కుమార్ కుశాగ్ర కూడా శతకంతో రాణింపు
- రెండో ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోరు నమోదు
- సౌత్ జోన్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తున్న ఈస్ట్ జోన్

**డీడీ9 వార్త :**

చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ (270) రికార్డు డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. అతనికి కుమార్ కుశాగ్ర (101) శతకంతో జత కలవడంతో, ఈస్ట్ జోన్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 708 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. దీంతో సౌత్ జోన్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ విజయం దిశగా పటిష్ఠమైన పునాది వేసుకుంది.

ఓవర్‌నైట్ స్కోరు 385/4తో రెండో రోజు ఆట ప్రారంభించిన ఈస్ట్ జోన్, ఆరంభం నుంచే పరుగుల వరద పారించింది. వికెట్ల కోసం తీవ్రంగా ప్రయత్నించిన సౌత్ జోన్, కొత్త బంతిని తీసుకున్నా ఫలితం లేకపోయింది. పేసర్లు మహ్మద్ సిరాజ్, ఎండీ నిధీశ్ బౌలింగ్‌ను ఇషాన్ కిషన్ సమర్థంగా ఎదుర్కొని బౌండరీలతో విరుచుకుపడ్డాడు. మరో ఎండ్‌లో కుశాగ్ర కూడా దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు.

లంచ్‌కు ముందు కుమార్ కుశాగ్ర తన ఆరో ఫస్ట్‌క్లాస్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. అయితే, శతకం తర్వాత త్రిపురాణ విజయ్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించి ఫైన్ లెగ్ వద్ద ఫీల్డర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. కుశాగ్ర ఔటైనా ఇషాన్ కిషన్ తన జోరును ఏమాత్రం తగ్గించలేదు. అలసిపోయిన సౌత్ జోన్ బౌలర్లను లక్ష్యంగా చేసుకుని, సులువుగా బౌండరీలు బాదుతూ 270 బంతుల్లో డబుల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

డబుల్ సెంచరీ తర్వాత మరింత వేగంగా ఆడిన ఇషాన్ కిషన్, ట్రిపుల్ సెంచరీ వైపు దూసుకెళ్లాడు. ఈ క్రమంలో కాస్త అలసటకు గురై తాత్కాలికంగా రిటైర్ అయినా, మహ్మద్ షమీ (28) ఔటైన తర్వాత తిరిగి క్రీజులోకి వచ్చాడు. అయితే, మరోవైపు వికెట్లు పడుతుండటంతో భారీ షాట్‌కు ప్రయత్నించి లాంగ్ ఆన్ బౌండరీ వద్ద క్యాచ్ ఔటయ్యాడు. కేవలం 30 పరుగుల తేడాతో ట్రిపుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. తన 334 బంతుల ఇన్నింగ్స్‌లో 30 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. దులీప్ ట్రోఫీ చరిత్రలోనే ఇది 8వ అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం విశేషం.



చివరకు ఈస్ట్ జోన్ 163 ఓవర్లలో 708 పరుగులకు ఆలౌట్ అయింది. సౌత్ జోన్ బౌలర్లలో త్రిపురాణ విజయ్ 4 వికెట్లు పడగొట్టగా, చామ మిలింద్ 2 వికెట్లు తీశాడు. ఈ భారీ స్కోరుతో ఈస్ట్ జోన్ మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది.

**సంక్షిప్త స్కోరు:**
ఈస్ట్ జోన్: 163 ఓవర్లలో 708 ఆలౌట్ (ఇషాన్ కిషన్ 270, కుమార్ కుశాగ్ర 101; త్రిపురాణ విజయ్ 4/180, చామ మిలింద్ 2/88).

# పాక్ కెప్టెన్‌కు ఐసీసీ ఫైన్.. షఫాలీని ఔట్ చేసి సైగలు చేయడంతో చర్యలు

- షఫాలీ వర్మను ఔట్ చేశాక అతిగా సంబరాలు చేసుకున్న పాక్ కెప్టెన్
- ఫాతిమా సనా ప్రవర్తనపై చర్యలు తీసుకున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి
- మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత, ఒక డీమెరిట్ పాయింట్ కేటాయింపు
- 24 నెలల వ్యవధిలో ఫాతిమాకు ఇది రెండో డీమెరిట్ పాయింట్
- ఈ మ్యాచ్‌లో పాక్‌ను చిత్తుగా ఓడించిన భారత మహిళల జట్టు

**డీడీ9 వార్త :**

మహిళల ఆసియా కప్‌లో భాగంగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా ఐసీసీ క్రమశిక్షణ నియమావళిని ఉల్లంఘించింది. టీమిండియా బ్యాటర్ షఫాలీ వర్మ వికెట్ తీసిన అనంతరం అనుచితంగా ప్రవర్తించినందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఆమెపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించడంతో పాటు, ఆమె ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్‌ను చేర్చింది.

ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్ షఫాలీ వర్మ (12) ఫాతిమా సనా బౌలింగ్‌లోనే క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. వికెట్ తీసిన ఉత్సాహంలో ఫాతిమా, షఫాలీని ఉద్దేశించి పెవిలియన్ వైపు వెళ్లాలంటూ వేలితో సైగ చేస్తూ అనుచితంగా ప్రవర్తించింది. ఇది ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవల్ 1 నిబంధనలను ఉల్లంఘించడమేనని మ్యాచ్ అధికారులు నిర్ధారించారు. ఈ నేపథ్యంలోనే ఆమెకు జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

గత 24 నెలల కాలంలో ఫాతిమా సనాకు ఇది రెండో డీమెరిట్ పాయింట్ కావడం గమనార్హం. గత ఏడాది ఆగస్టు 6న ఐర్లాండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో అంపైర్ ఔట్ ఇచ్చినప్పటికీ క్రీజు వదిలి వెళ్లేందుకు నిరాకరించినందుకు ఆమె ఖాతాలో తొలి డీమెరిట్ పాయింట్ చేరింది.




# అలా చేసినంత కాలం జట్టులో నా చోటుకు ఢోకా ఉండదు

- జట్టులో చోటు కోసం పరుగులే కీలకమన్న పడిక్కల్
- మూడో స్థానంలో ఆడటంపై పోలికలు పట్టించుకోనన్న యువ బ్యాటర్
- ద్రవిడ్ సలహాలు తనకు ఎంతో ఉపయోగపడ్డాయని వెల్లడి
- అవకాశాలు పరిమితంగా ఉన్నాయన్న పడిక్కల్
- విజయాలకు తోడ్పడటమే తన లక్ష్యమని స్పష్టీకరణ

**డీడీ9 వార్త :**

భారత టెస్టు జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకోవాలంటే నిరంతరం పరుగులు చేయడమే మార్గమని యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అన్నాడు. జట్టు విజయాల్లో తన వంతు పాత్ర పోషిస్తూ మంచి ప్రదర్శన కొనసాగిస్తే చోటు గురించి ఆందోళన అవసరం లేదని ధీమా వ్యక్తం చేశాడు.

శ్రీలంక పర్యటనలో పడిక్కల్ సత్తా చాటాడు. వరుసగా రెండు శతకాలు బాదాడు. భారత్ 1-0తో సిరీస్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డును సైతం అందుకున్నాడు. సాయి సుదర్శన్ అందుబాటులో లేకపోవడంతో మూడో స్థానంలో బ్యాటింగ్ చేసిన పడిక్కల్ ఆకట్టుకున్నాడు.

తనకు అవకాశం వస్తుందని ముందే తెలియడం ఉత్సాహాన్నిచ్చిందని పడిక్కల్ చెప్పాడు. "అవకాశాలు అంత సులభంగా రావు. వాటి కోసం ఎంతో కష్టపడాలి. అవకాశం వచ్చినప్పుడు సద్వినియోగం చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలి. సిరీస్ ఆరంభంలోనే ఆడతానని చెప్పడంతో చాలా సంతోషించా. బ్యాటింగ్ పరంగా నా కెరీర్‌లోనే అత్యుత్తమ దశలో ఉన్నానని భావించా" అని జియోస్టార్‌తో చెప్పాడు.

మూడో స్థానంలో బ్యాటింగ్ చేయడంపై వచ్చే అంచనాలు, పోలికల గురించి కూడా స్పందించాడు. రాహుల్ ద్రవిడ్, ఛతేశ్వర్ పుజారా వంటి దిగ్గజాలు ఆ స్థానంలో ఆడారని గుర్తు చేశాడు. అయితే వారితో పోల్చుకోవడంపై తాను దృష్టి పెట్టనని స్పష్టం చేశాడు. "ఏ స్థానంలో బ్యాటింగ్ చేస్తున్నానన్నది ముఖ్యం కాదు. జట్టుకు నా వంతు సహకారం అందించడమే లక్ష్యం" అని అన్నాడు.

టెస్టు బ్యాటింగ్‌పై తన ఆలోచనా విధానాన్ని తీర్చిదిద్దడంలో ద్రవిడ్ సలహాలు ఎంతో ఉపయోగపడ్డాయని పడిక్కల్ తెలిపాడు. ఎక్కువసేపు క్రీజులో నిలవాలంటే సరైన సంసిద్ధత, స్పష్టమైన ప్రణాళిక అవసరమని ద్రవిడ్‌తో జరిగిన చర్చల నుంచి నేర్చుకున్నట్లు చెప్పాడు.

"టెస్టుల్లో అవకాశాలు పరిమితంగా ఉంటాయి. జట్టులో చోటు సుస్థిరం చేసుకోవడం అంత సులభం కాదు. ఏదీ శాశ్వతం కాదు. నేను పరుగులు చేస్తూ, భారత టెస్టు జట్టు విజయాలకు తోడ్పడాలనుకుంటున్నా. అలా చేస్తున్నంతకాలం జట్టులో నాకు చోటు ఉంటుందని



# డ్రెస్సింగ్ రూమ్‌లో ఏం జరుగుతోంది?.. పాక్ జట్టుపై పీసీబీ ఫోకస్

- పాక్ జట్టుపై పీసీబీ అంతర్గత విచారణ
- ఆటగాళ్ల క్రమశిక్షణపై ఆరోపణల పరిశీలన
- తొలి రెండు టెస్టుల్లో పాక్‌కు ఘోర ఓటమి
- ఏడుగురు ఆటగాళ్లు స్వదేశానికి పయనం
- బోర్డు చర్యలపై మాజీ ఆటగాళ్ల విమర్శలు

ఇంగ్లాండ్ పర్యటనలో పాకిస్థాన్ క్రికెట్ జట్టులో నెలకొన్న గందరగోళంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కీలక నిర్ణయం తీసుకుంది. ఆటగాళ్ల క్రమశిక్షణ, ప్రవర్తనపై వస్తున్న ఆరోపణలను పరిశీలించేందుకు అంతర్గత విచారణ ప్రారంభించింది. డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలు తలెత్తాయంటూ స్థానిక మీడియాలో వచ్చిన కథనాల నేపథ్యంలో ఈ చర్య చేపట్టినట్లు బోర్డు తెలిపింది.

ఇంగ్లాండ్‌తో తొలి రెండు టెస్టుల్లో పాకిస్థాన్ ఘోర పరాజయాలను చవిచూసింది. హెడింగ్లీలో జరిగిన తొలి టెస్టులో, లార్డ్స్‌లో జరిగిన రెండో టెస్టులో ఓటమి తర్వాత జట్టు వ్యవహారశైలిపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో పర్యటన మధ్యలోనే ఏడుగురు ఆటగాళ్లను స్వదేశానికి పంపించారు. వికెట్ కీపర్ మహ్మద్ రిజ్వాన్, ఓపెనర్ ఇమామ్ ఉల్ హక్, టీ20 కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా కూడా ఈ జాబితాలో ఉన్నారు.

ప్రధాన కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను కూడా స్వదేశానికి పంపించారు. వారి స్థానాల్లో మైక్ హెసన్, యాష్లీ నాఫ్కే బాధ్యతలు చేపట్టారు. పీసీబీ మీడియా, డిజిటల్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ అమీర్ మీర్ ఈ విషయాన్ని 'ఎక్స్' ద్వారా వెల్లడించారు. క్రమశిక్షణ, ప్రవర్తనకు సంబంధించిన అంశాలను బోర్డు నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అయితే సోషల్ మీడియాలో వస్తున్న నిర్ధారణ లేని ఆరోపణలను నమ్మొద్దని సూచించారు. అధికారిక ప్రకటనలనే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఇప్పటికే పీసీబీ చర్యలపై మాజీ క్రికెటర్లు, నిపుణుల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) జాబితాలో పాకిస్థాన్ ప్రస్తుతం చివరి స్థానంలో ఉంది. ఈ పరిస్థితుల్లో సెప్టెంబర్ 9న బర్మింగ్‌హామ్‌లో మూడో టెస్టు ప్రారంభం కానుంది. బాబర్



ఆజమ్ నేతృత్వంలోని మార్పులతో కూడిన జట్టు ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్ వైట్‌వాష్‌ను తప్పించుకోవాలని చూస్తోంది.

DD9 వార్త

# ప్రియాంక కొత్త ప్రయాణం



వైవిధ్యమైన కథలు, పాత్రలతో దక్షిణాదిలో మంచి క్రేజ్‌ను సంపాదించుకుంది కథానాయిక ప్రియాంక మోహన్. గతేడాది 'ఓజీ' సినిమాతో తెరపై మెరిసిన ఈమె.. ఇప్పుడు మరో కొత్త చిత్రాన్ని గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆమె, కథానాయకుడు జై ప్రధాన పాత్రల్లో ఓ సినిమాలో నటిస్తున్నారు. దీనికి ఎంఎస్ ఆనందన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రకటిస్తూ... సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది ప్రియాంక. "ఒక ఉత్కంఠభరితమైన కొత్త ప్రయాణం మొదలవుతోంది" అనే వ్యాఖ్యను జోడించింది. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని క్రైమ్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్నట్లు, త్వరలో నటీనటులకు సంబంధించిన పూర్తి వివరాల్ని వెల్లడించనున్నట్లు చిత్రవర్గాలు తెలిపాయి. ఇందులో యోగిబాబు కీలక పాత్రలో నటిస్తున్నారు.

# అలియా ప్రేమయుద్ధం ముగిసింది

'ఆల్ఫా'తో ఇటీవలే గూఢచారి పాత్రలో తెరపై సాహసాలు చేసింది బాలీవుడ్ కథానాయిక అలియా భట్. ఇప్పుడామె ప్రేమికురాలిగా అలరించడానికి సిద్ధమైంది. ఆమె, రణ్‌బీర్ కపూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్ అండ్ వార్'. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కిస్తున్నారు. విక్కీ కౌశల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణ ముగిసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్ని వేగవంతంగా పూర్తి చేసే పనిలో చిత్రబృందమని సమాచారం. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రేమ, యుద్ధం, భావోద్వేగాలు లాంటి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని, త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాల్ని వెల్లడించడానికి సన్నాహాలు చేస్తున్నారని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఈ రొమాంటిక్ వార్ డ్రామా వచ్చే ఏడాది థియేటర్లలోకి రాబోతుంది.





## 'మహేంద్రగిరి వారాహి'... ద్వితీయార్థం దుమ్ముదులిపేస్తుంది

"మంచి కథా బలమున్న సినిమా 'మహేంద్రగిరి వారాహి'. ఇది కచ్చితంగా బాగా ఆడుతుంది.. పెద్ద హిట్ కాబోతుంది" అన్నారు కథానాయకుడు అఖిల్. సుమంత్, ఐశ్వర్య రాజేశ్ ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమాని సంతోష్ జాగర్లపూడి తెరకెక్కించారు. లక్ష్మణ్, కలిపు మధు నిర్మించారు. సిద్ధు జొన్నలగడ్డ, మీనాక్షి గోస్వామి, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈనెల 11న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. హీరో అక్కినేని అఖిల్, సిద్ధు జొన్నలగడ్డ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ.. "ఈరోజుల్లో కమర్షియల్ సినిమా అంటే నాన్ కమర్షియల్ సినిమా. కంటెంట్‌ని నమ్మి.. దాన్ని బాగా తీసి థియేటర్‌లోకి తీసుకురావాలి. నేను చిన్నప్పటి నుంచి సుమంత్ ఒళ్లో పెరిగాను. నేను ఇంట్లో అమ్మానాన్నలతో చెప్పలేని ప్రతి విషయాన్ని.. ఆయనకే చెప్పేవాడ్ని.. అడిగేవాడిని. తనెప్పుడూ ఒక్కసారి కూడా నన్ను కాదనలేదు. తను నాపై చూపిన ప్రేమకి ఎప్పుడూ రుణపడి ఉంటా. సిద్ధు ఓవైపు హీరోగా హిట్లు కొడుతూ.. ఇలాంటి నిజాయతీతో కూడిన కంటెంట్ సినిమాకి అండగా నిలవడం అభినందనీయం. సంతోష్ ఈ సినిమాకి ప్రాణం పెట్టేశాడు. ఇది ఇవాల్టి సినిమా. ఇంత మంచి చిత్రాన్ని తీసుకొచ్చినందుకు దర్శక నిర్మాతలకు థ్యాంక్స్. ఇది కచ్చితంగా అందరికీ నచ్చుతుంది" అన్నారు. "ఈ సినిమాలో ప్రతి ఆర్టిస్ట్ నటించలేదు.. జీవించారు. ఈ చిత్రంతో అనూప్ రూబెన్స్ 2.ఓని చూస్తారు. సిద్ధు జొన్నలగడ్డ పోషించిన పాత్ర వల్ల ఈ సినిమా మరో స్థాయికి వెళ్లింది" అన్నారు దర్శకుడు సంతోష్.

కథానాయకుడు సుమంత్ మాట్లాడుతూ.. "ఈ సినిమా చేస్తున్నప్పుడు ఏదో ఓ తెలియని శక్తి మా వెనకుండి మమ్మల్ని నడిపిస్తుందన్న నమ్మకం ఉండేది. అదిప్పుడు అందరికీ కనిపిస్తోందని నమ్ముతున్నా. సెప్టెంబరు 11న మా కష్టాన్ని చూడబోతున్నారు. దీనిపై మేము చాలా నమ్మకంగా ఉన్నాం. ఫస్ట్‌హాఫ్ కన్నా సెకండాఫ్ దుమ్ము దులిపేసేలా ఉంటుంది. ప్రీక్లైమాక్స్, క్లైమాక్స్ తప్పకుండా అందర్నీ ఆకట్టుకుంటుంది. ఈ చిత్రానికి సిద్ధు జొన్నలగడ్డ పాత్ర చాలా కీలకంగా నిలుస్తుంది. ఇందులో నాకు.. తనకీ మధ్య వచ్చే ఎపిసోడ్ ఆకర్షణగా నిలుస్తుంది" అన్నారు. "నిర్మాత మధు వల్లే నేనీ చిత్రంలో భాగమయ్యా. ఈ సినిమా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడు చెప్పింది చెప్పినట్లు తీశారు. కచ్చితంగా అందరికీ నచ్చుతుంది" అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందం, అలీ, లక్ష్మణ్, మధు, అనూప్ రూబెన్స్, కాసర్ల శ్యామ్, వెనిగళ్ల రాంబాబు, మంజు భార్గవి, జెస్సీ గిఫ్ట్ తదితరులు పాల్గొన్నారు.

# ధురంధర్, పుష్ప రికార్డులు బ్రేక్



పాన్‌ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన 'ధురంధర్', 'పుష్ప' చిత్రాలెక్కడ? హిందీలో తప్ప ఇంకే భాషలోనూ విడుదల కాని 'హనుమాన్ అంశ్' ఎక్కడ? అలాంటి ఓ చిన్న సినిమా పాన్‌ఇండియా సినిమాల రికార్డులు బద్దలు కొట్టడమా అని ఆశ్చర్యపోతున్నారు కదూ? నమ్మశక్యం కాని అలాంటి అద్భుతం ఇప్పుడు బాలీవుడ్‌లో ఆవిష్కృతమైంది. అయిదో వారాంతం వసూళ్ల విషయంలో 'ధురంధర్', 'పుష్ప'లను వెనక్కినెట్టింది 'హనుమాన్ అంశ్'

ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలి బాబా జీవిత చరిత్ర ఆధారంగా విశాల్ చతుర్వేది తెరకెక్కించిన ఈ చిత్రం ఆగస్టు 7న విడుదలైంది. తొలి రెండు వారాలు అంతగా ప్రభావం చూపించని 'హనుమాన్ అంశ్', పాజిటివ్ మౌత్ టాక్‌తో మూడో వారం నుంచి అనూహ్యంగా వసూళ్ల వర్షం కురిపిస్తోంది. 31 రోజుల్లోనే రూ.100 కోట్ల మైలురాయిని చేరుకుంది. అయిదో వారాంతం (సెప్టెంబరు 46)లో ఈ మూవీ ఏకంగా రూ.45.60 కోట్లు కలెక్ట్ చేయడం విశేషం.

# 'రణబాలి' టార్గెట్ మొదలైంది.. టీజర్ అప్‌డేట్ వచ్చేసింది

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి'. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రష్మిక కథానాయిక. ఆర్నాల్డ్ వోస్లూ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ దసరా కానుకగా అక్టోబరు 16న విడుదల కానుంది.

ఈ క్రమంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలు షురూ చేసింది. ఇందులో భాగంగా సెప్టెంబరు 9న టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. మూవీ విడుదలకు దాదాపు నెల రోజుల సమయం ఉండటంతో సినిమాను ప్రేక్షకులకు మరింత చేరువ చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగానే టీజర్‌తో ఈ కార్యక్రమాలను మొదలు పెట్టనుంది. ఇది 1854 1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతోన్న సినిమా. విజయ్ ఇందులో ఓ యోధుడి పాత్రలో అలరించనున్నారు. ఈ చిత్రానికి అజయ్ అతుల్ సంగీతం అందిస్తున్నారు.



# చరిత్ర తిరగరాసిన స్పైడర్‌మ్యాన్.. భారత్‌లో రూ.500 కోట్లు

హాలీవుడ్ చిత్రాలు భారత్‌లో వసూళ్ల వర్షం కురిపించడం కొత్తేం కాదు. ముఖ్యంగా 'అవెంజర్స్', 'అవతార్', 'స్పైడర్‌మ్యాన్' ఫ్రాంఛైజీ చిత్రాలతో పాటు, దర్శకుడు క్రిస్టఫర్ నోలన్ సినిమాలకూ మన దేశంలో పెద్ద సంఖ్యలో అభిమానులున్నారు. అందుకే ఇక్కడి స్టార్ల సినిమాలతో పోటీపడేలా వాటికి భారీ మొత్తంలో వసూళ్లు వస్తుంటాయి. అయితే ఇప్పటివరకూ ఏ హాలీవుడ్ చిత్రానికీ సాధ్యం కాని రీతిలో ఇండియన్ బాక్సాఫీసు వద్ద ప్రభంజనం సృష్టించింది 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే'. ఏకంగా రూ.500 కోట్లు కలెక్ట్ చేసి సత్తా చాటింది. భారత్‌లో ఈ మైలురాయిని అందుకున్న తొలి హాలీవుడ్ చిత్రంగా చరిత్ర సృష్టించింది

మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగమైన స్పైడర్‌మ్యాన్ పాత్రతో తెరకెక్కిన ఈ సినిమా జులై 30న భారీ అంచనాలతో విడుదలైంది. తొలిరోజు నుంచే కళ్లుచెదిరే వసూళ్లతో అదరగొట్టింది. తొలి వారంలోనే రూ.330 కోట్లకు పైగా వసూలు చేసింది. 39 రోజుల్లోనే రూ.500 కోట్ల మార్కును అధిగమించడం విశేషం. స్పైడర్‌మ్యాన్ పాత్రలో మరోసారి టామ్ హోలండ్ నటించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్త వసూళ్లలోనూ తిరుగులేని ఆధిక్యం ప్రదర్శిస్తోంది. ఇప్పటివరకూ రూ.22,600 కోట్లకు పైగా వసూలు చేసినట్లు హాలీవుడ్ విశ్లేషకులు చెబుతున్నారు.



# నాని 'ది ప్యారడైజ్' రిలీజ్ డేట్‌పై క్లారిటీ



నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్'. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీని సెప్టెంబరు 24న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. అయితే, మరోసారి 'ది ప్యారడైజ్' వాయిదా పడుతుందంటూ గత రెండు మూడు రోజులుగా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌లు వైరల్ అవుతున్నాయి. ఇంకా పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి కాలేదని, ఒక పాటను కూడా షూట్ చేయాల్సి ఉందని ఆ పోస్టుల సారాంశం.

ఆ వార్తలన్నింటికీ చెక్ పెడుతూ మూవీ విడుదల విషయంలో ఎలాంటి మార్పూ లేదని చిత్ర బృందం మరోసారి ప్రకటించింది. ఇందుకు సంబంధించి సెప్టెంబరు 24న రిలీజ్ డేట్‌తో కూడిన పోస్టర్‌ను విడుదల చేసింది. అంతేకాదు, 23వ తేదీ రాత్రి స్పెషల్ ప్రీమియర్లను కూడా ప్రదర్శించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. తెలుగుతో పాటు, ఇతర భాషల్లోనూ ఈ మూవీని విడుదల చేయనున్నారు.

విజయవంతమైన 'దసరా' తర్వాత కథానాయకుడు నాని - దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రానున్న సినిమా ఇది. ఇందులో నాని 'జడల్' (Jadal) పాత్రలో కనిపించనున్నారు. గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'దసరా' మంచి టాక్‌ను సంపాదించుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. నానితో పాటు ఈ మూవీలో మోహన్‌బాబు, తనికెళ్ల భరణి, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు, ఈశ్వరీ రావు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కయాదు లోహర్ (Kayadu Lohar) కథానాయికగా మెరవనున్నారు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.